ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 9 జూలై 2025



మామిడి రకాలెన్నో తెలుసుకో

ముందు మామిడిలో రకాలెన్నో తెలుసుకో. వాటిలో కనీసం నాలుగు పేర్లయినా తెలుసుకుని ఆ తర్వాత మామిడి రైతులను పరామర్శించేందుకు రా. సీఎంగా ఐదేళ్లలో ఏ రోజైనా మామిడి రైతుల గురించి మాట్లాడావా? ఇప్పుడు దండయాత్రలాగా రావడమేమిటి? పొగాకును తొక్కినట్టు మామిడి పండ్లను తొక్కేస్తావా? జగన్ పర్యటనకు 500 మందిని అనుమతించడమే చాలా ఎక్కువ.

- భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ నేత, టీటీడీ సభ్యుడు

జగన్.. మీ నేతల ఫ్యాక్టరీకి వెళ్లు

మామిడికి మార్కెట్‌లో డిమాండు ఎందుకు తగ్గిందనేది మీ నేతల గుజ్జు ఫ్యాక్టరీల వద్దకెళ్లు. వారిని అడిగి తెలుసుకో. పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ ఫుడ్స్, వైసీపీ నేతలకు సంబంధించిన సీజీఆర్ ఫుడ్స్, టాస్ తదితర పరిశ్రమలు మామిడి పండ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదో వారిని అడుగు. అంతేగాని పరామర్శ పేరిట రైతులపైకి దండయాత్ర చేస్తాననడం సరికాదు.

- నీలాయపాలెం విజయకుమార్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్



- గతంలో జరిగిన విషాదాల నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు
- అనుమతుల్లేకపోయినా బలప్రదర్శనకు సిద్ధమవుతున్న వైసీపీ
- పోలీసుల అనుమతి 500 మంది.. వైసీపీ టార్గెట్ 30 వేలు..
- ఇప్పటికే బంగారుపాళ్యంలో 600 మంది పోలీసులు, అన్ని మార్గాల్లో చెక్‌పోస్టులు
- మాట వినకుంటే అత్యంత కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధం



బంగారుపాళ్యం మండలం తిమ్మోజుపల్లె సమీపంలో జాతీయ రహదారి పక్కన వైసీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

జగన్ పర్యటన.. ఉత్కంఠ

చిత్తూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పోలీసుల ఆంక్షలు. మరోవైపు వీటిని ధిక్కరించేలా వైసీపీ ప్రయత్నాలు. దీంతో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ బుధవారంనాటి బంగారుపాళ్యం పర్యటన ఒకరకమైన ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల జగన్ పర్యటించినప్పుడు అక్కడ సంభవించిన మరణాలు, ప్రమాదాల నేపథ్యంలో పోలీసులు ఆంక్షల్ని విధించారు. పూతలపట్టు ఇన్‌చార్జి సునీల్ ఇచ్చిన అర్జీ మేరకు ఎస్పీ మణికంఠ 500 మందికి అనుమతి ఇచ్చారు. అనుమతుల్ని ఖాతరు చేయని వైసీపీ నాయకులు పెద్దఎత్తున జనాల్ని తరలించేందుకు సిద్ధమయ్యారు. మండలానికి వెయ్యి చొప్పున 30వేల మంది టార్గెట్ పెట్టుకున్నా.. 10వేల మంది వస్తారని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలోని పోలీసులతో పాటు తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున పోలీసులు మంగళవారమే బంగారుపాళ్యం చేరుకున్నారు. సుమారు 600 మంది పోలీసులు బంగారుపాళ్యంలో ఉన్నారు. ఎస్పీ మణికంఠ, డీఎస్పీ తదితర అధికారులు మంగళవారం బంగారుపాళ్యంలో పర్యటించి.. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హెలిప్యాడ్ వద్ద 30మంది, మార్కెట్ యార్డులో 500 మందికి మించి అనుమతించకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే బంగారుపాళ్యం వచ్చే అన్ని హైవే, గ్రామీణ మార్గాల్లో పెద్దఎత్తున చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేశారు. ఆయామార్గాల నుంచి వచ్చే వాహనాలను అక్కడే అడ్డుకుంటారు. ఆర్టీసీ బస్సుల్ని సైతం తనిఖీలు చేయనున్నారు. చెక్‌పోస్టుల్లో ప్రజల్ని వెనక్కి వెళ్లిపొమ్మని చెప్తారు. మాట వినకుంటే అత్యంత కఠినంగా వ్యవహరించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన జగన్ పర్యటనల్లో వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ఘర్షణలు చేశారని, బంగారుపాళ్యంలో కూడా అలాంటి పనులు చేసే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లోని పర్యటనలో చోటు చేసుకున్న సంఘటనలు బంగారుపాళ్యంలో రిపీట్ అవ్వకుండా గట్టిగా వ్యవహరించేందుకు సమాయత్తంగా ఉన్నారు. బారికేడ్లను తోసుకుని వస్తాం, మాట వినకుండా చెక్‌పోస్టులను దాటేస్తాం అనేవారి పట్ల పోలీసులు తీవ్ర చర్యలు తీసుకునే అవకాశముంది.

జగన్ పర్యటన ఇలా

బెంగళూరులోని జకూర్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10.50 గంటలకు బంగారుపాళ్యం మండలం కొత్తపల్లె వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ్నుంచి కారులో 11.20 గంటలకు మ్యాంగో మార్కెట్‌కు చేరుకుని గంటపాటు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 12.35 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

'రాజకీయ లబ్ధి కోసమే పర్యటన'

బంగారుపాళ్యం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధికోసమే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బంగారుపాళ్యంలో పర్యటిస్తున్నారని, ఆయన పర్యటనతో రైతులకు ఎలాంటి లాభం లేదని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులో మామిడి మండీ యజమానులతో కలిసి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకునేందుకు అనేక ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుందని చెప్పారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 6.50 లక్షల మెట్రిక్ టన్నులకు రూ.4 సబ్సిడీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలను ఒప్పించి తోతాపురి మామిడి కాయలను కొనడానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. వైసీపీ నాయకులకు చెందిన గుజ్జు పరిశ్రమ యాజమాన్యాలు టన్ను తోతాపురి ఏ ధరకు కొన్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మామిడి రైతులను ఆదుకోవడం చేతకాకే తమపై తప్పుడు ప్రచారాలు సాగిస్తున్నారని విమర్శించారు. జగన్ పర్యటన అంతా ఓ డ్రామా అని.. దాన్ని తిప్పికొట్టాలని రైతులకు సూచించారు.



మీడియాతో మాట్లాడుతున్న మండీ యాజమానులు, టీడీపీ నాయకులు

- ఐదేళ్లు దోచుకుని ఇప్పుడేమో

ఎవరి ఖర్చులు వారివా?

- మాజీ సీఎం పర్యటన ఖర్చు విషయంలో వైసీపీ నేతల మధ్య పొరపొచ్చాలు

చిత్తూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ బంగారుపాళ్యం పర్యటన నేపథ్యంలో జిల్లా వైసీపీ నేతల మధ్య పొరపొచ్చాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. బంగారుపాళ్యం మండలం పూతలపట్టు నియోజకవర్గంలోకి వస్తుండడంతో మొత్తం ఖర్చును అక్కడి ఇన్‌చార్జి సునీల్‌కుమార్ భరించాలని తొలుత 'బడా' నాయకుడు సూచించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యే కానని, అంత మొత్తం భరించలేనని ఆయన వివరణ ఇచ్చుకున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. తన నియోజకవర్గం వరకే ఖర్చు పెట్టుకునేందుకు ఒప్పుకున్నట్లు సమాచారం. మిగతా నియోజకవర్గాల్లోనూ ఆయా ఇన్‌చార్జులు ఖర్చు పెట్టుకుని ప్రజల్ని తరలించాలని ఆ బడా నేత సూచించారట. మొత్తం ఖర్చు ఆ బడా నాయకుడే భరిస్తారని అనుకున్నా.. ఆయన పట్టించుకోక పోవడంతో 'ఐదేళ్ల పాటు మైన్స్‌లో, వైన్స్‌లో భారీగా దోచుకుని ఇప్పుడు అధినేత పర్యటన ఖర్చును విభజించడం ఏంట'ని వైసీపీ నేతలు చర్చించుకుంటున్నారు. ఆ బడా నాయకుడు కూడా తన నియోజకవవర్గంలో మాత్రమే ఖర్చు పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి 2029 ఎన్నికల్లో టికెట్ ఆశిస్తుండడంతో ఆ దిశగా జనసమీకరణకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి తన కొడుకు అభినయ్‌రెడ్డిని ఎలివేషన్ చేసుకునేందుకు నియోజకవర్గం నుంచి సుమారు వెయ్యి మందితో వచ్చి బలప్రదర్శన చేయనున్నట్లు తెలుస్తోంది. మిగతావాళ్లు నామమాత్రంగా జనాల్ని తరలించే ప్రయత్నం చేస్తుండగా, నగరి నుంచి రోజా పాత్ర పెద్దగా లేనట్లు తెలుస్తోంది.

- మతి స్థిమితంలేని వ్యక్తుల

నియంత్రణకు ప్రణాళిక

- ఎస్పీ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాల ఏర్పాటు

తిరుపతి(నేరవిభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం సైకో వీరంగంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరునగరిలో భిక్షగాళ్లు, మతిస్థిమితం లేని వ్యక్తులు, సైకోల ఏరివేతకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా తిరుపతి ఈస్ట్, అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఉన్నారని పోలీసులు గుర్తించారు. వీరంతా ఎక్కడెక్కడ తిరుగుతున్నారు. ఎక్కడ తల దాచుకుంటున్నారనేది పరిశీలించి ఎంఆర్‌పల్లెలోని బెగ్గర్ల షెల్టర్‌కు తరలించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం తిరుపతిలో 60 నుంచి 70మంది భిక్షగాళ్లు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వీరితో పాటు మతిస్థిమితం లేని వ్యక్తులున్నారు. వీరిని చట్ట ప్రకారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి ఆస్పత్రికి తరలించి వారి మానసిక స్థితిపై సర్టిఫికెట్ తీసుకున్నాక అవసరమైన వారిని వైజాగ్‌లోని ఆస్పత్రికి తరలించడానికి పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. మతిస్థిమితం లేని వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలని డీఎస్పీ భక్తవత్సలం విజ్ఞప్తి చేశారు.

మతిస్థిమితం లేకనే హత్య

తిరుపతి కపిలతీర్థం సమీపంలో సోమవారం కత్తి, కర్రతో వీరంగం సృష్టించి ఒకరి హత్యకు.. ఇద్దరు గాయపడటానికి కారణమైన వ్యక్తిని మంగళవారం రుయాస్పత్రికి తరలించారు. ఇతడిని పరీక్షించిన వైద్యులు.. మానసిక స్థిమితం లేదని నిర్ధారించారని అలిపిరి సీఐ రామ్‌కిషోర్ చెప్పారు. అతడిని బుధవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరచి న్యాయమూర్తి ఆదేశాలతో వైజాగ్‌లోని మెంటల్ ఆస్పత్రికి తరలించనున్నామన్నారు.

పుత్తూరులో చెత్తకు కదలిక

- వడివడిగా చర్యలు



డంపింగ్ యార్డ్ వద్ద చెత్తశుద్ధికి ఏర్పాటు చేసిన యంత్రాలు

పుత్తూరు అర్బన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఏడేళ్లుగా పేరుకుపోయిన చెత్త నిల్వలకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. గోవిందపాలెం డంపింగ్ యార్డులో గుట్టలుగా పేరుకుపోయిన 20 వేల టన్నుల చెత్తశుద్ధికి చర్యలు ప్రారంభయ్యాయి. దీంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చాలా సార్లు చెత్త సమస్యపై ఫిర్యాదు చేసినా స్పందన ఉండేదికాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్త సమస్యపై శ్రద్ధ పెట్టింది. ఇందులోభాగంగా జిగ్మా సంస్థ ఈ-వేలంలో చెత్త శుద్ధి ప్రక్రియను దక్కించుకుంది. వారం రోజుల క్రితం యంత్రాల సాయంతో చెత్త తొలగించేందుకు శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచనతో అదనపు యంత్రాలతో పనులను వేగవంతం చేసింది. ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు, ప్రాసెస్ చేసిన వర్మీ కంపోస్ట్ ఎరువును రైతులకు అందించనుంది. పొడి వ్యర్థాలను రీసైక్లింగ్ చేస్తుంని పబ్లిక్ హెల్త్ అధికారులు తెలిపారు.

రేపు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్


ఈదఫా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో కూడా

పాల్గొననున్న 3,47,565 విద్యార్థులు, తల్లిదండ్రులు

తిరుపతి(విద్య), జూలై 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సంబంధాలను బలపరిచి.. మరింతగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈఏడాది అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పెద్దఎత్తున సమావేశాలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ క్రమంలో గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ (ఎంపీటీఎం) సమావేశాలు జరుగనున్నాయి. మొత్తం 3,47,565 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలకు హాజరుకానున్నారు. ఎంపీటీఎం సమావేశాలను ఇదివరకెన్నడూ లేనివిధంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఇంటర్, పాఠశాల విద్యాశాఖలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఆయా శాఖల కంపోజిటివ్ గ్రాంట్ నుంచి 20 శాతం నిధులను ఖర్చుచేసి ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయా విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్యనుబట్టి నిధులను కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ ఇలా పలు రకాల కమిటీలను ఏర్పాటుచేశారు.

ఈ ప్రయోజనార్థమే ఎంపీటీఎం

- పిల్లల ప్రగతికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను తల్లిదండ్రులకు అందజేయనున్నారు. సమగ్ర శిక్ష అధికారులు సిద్ధం చేస్తున్న ఈ ప్రోగ్రెస్ కార్డుల్లో మార్కులు, హాజరుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర రంగాల్లో విద్యార్థుల ప్రతిభ, ఆరోగ్యపరంగా ఎత్తు, బరువు, వ్యాధి నిర్ధారణ పరీక్షల వివరాలు పొందుపరుస్తున్నారు.
- విద్యార్థులు ఇళ్లల్లో ఉన్నపుడు తల్లిదండ్రులు వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాల గురించి పెద్దలకు అవగాహన కల్పించనున్నారు. సెల్‌ఫోన్ల వాడకం, డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలతోపాటు విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించేలా ఇంటరాక్షన్ సెషన్లు నిర్వహించనున్నారు.
- తల్లులకు రంగోలి, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు.
- కుటుంబ ఫొటో డ్రీమ్ వాల్స్, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, అమ్మ పేరుతో మొక్క నాటడం, గ్రీన్ పాస్‌పోర్ట్ కార్యక్రమాలు చేపడుతున్నారు.



చిత్తూరులో బిచ్చగాడిని చంపిన మరో బిచ్చగాడు

చిత్తూరు అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): బిచ్చగాడిని మరో బిచ్చగాడు రాడ్డుతో కొట్టి చంపిన సంఘటన చిత్తూరు నగరంలో చోటు చేసుకుంది. ఒకటవ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లె మండలం అరగొండకు చెందిన లోకేష్, జీడీ నెల్లూరు మండలం కోటాగరానికి చెందిన దివ్యాంగుడైన రాజేంద్రలు నగరంలో వివిధ ప్రాంతాల్లో బిచ్చమెత్తుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పోస్టాఫీసు వీధికి ఎదురుగా ఉన్న క్రాంతి ఫొటో స్టూడియో పక్కనే టీ దుకాణం వద్దకు ఇద్దరు చేరుకున్నారు. ఈ సమయంలో ఇద్దరికీ మాటామాట పెరిగడంతో ఆగ్రహానికి గురైన లోకేష్ పక్కనే ఉన్న రాడ్డుతో రాజేంద్ర తలపై బాదాడు. దాంతో రాజేంద్ర అక్కడికక్కడే మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాలుగు సింగిల్ విండోలకు పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీల మార్పు

తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు ప్రాథమిక సహకార సంఘాలకు (సింగిల్ విండోలు) పర్సన్ ఇంఛార్జి కమిటీలను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఎర్రావారిపాలెం, రామచంద్రాపురం, మల్లంగుంట, చిన్నగొట్టిగల్లు సింగిల్ విండోలకు ప్రస్తుతం అఫిషియల్ పర్సన్ ఇంఛార్జి కమిటీలు వున్నాయి. వాటి స్థానంలో ప్రభుత్వం తాజాగా నాన్ అఫిషియల్ పర్సన్ ఇంఛార్జి కమిటీలను నియమించింది. ఎర్రావారిపాలెం సింగిల్‌విండోకు ఛైర్మన్‌గా ఎస్.రఘు, సభ్యులుగా పల్లెపాకు నాగరాజు, డి.దేవేంద్రనాయుడు, రామచంద్రాపురం సింగిల్‌విండోకు ఛైర్మన్‌గా సి.జనార్దన చౌదరి, సభ్యులుగా ఏ.చిరంజీవి, ఎం.చిరంజీవిలు, మల్లంగుంట సింగిల్‌విండోకు ఛైర్మన్‌గా సి.మధుశేఖర్, సభ్యులుగా వి.చిరంజీవి, పి.మోహన్‌రెడ్డిలు నియమితులయ్యారు. ఈ కమిటీలు ఈనెల 30వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. తర్వాత కమిటీల పదవీ కాలాన్ని పొడిగించే అవకాశముంది. అలాగే చిన్నగొట్టిగల్లు సింగిల్ విండోకు ఛైర్మన్‌గా ఎం.ప్రభాకర్, సభ్యులుగా జి.శోభారాణి, పి.అలివేలమ్మ నియమితులయ్యారు. ఈ కమిటీ అక్టోబరు 30 దాకా కొనసాగనుంది. ఆపై ఈ కమిటీ గడువును కూడా పొడిగించే అవకాశముంది.

ఎస్‌పీఆర్ఈఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(వైద్యం), జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలను పొందేందుకు స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్ (ఎస్‌పీఆర్ఈఈ) పథకాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐ కార్పొరేషన్ రాయలసీమ ఆర్డీడీ రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ పథకం జూలై 1 నుంచి డిసెంబరు 31 వరకు అమల్లో ఉంటుంది. సంస్థలు, ఉద్యోగులను ఈఎస్ఐసీ పోర్టల్, శ్రామ్ సువిధ, ఎంసీఏ పోర్టల్ ద్వారా డిజిటల్‌గా నమోదు చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు. పాత బకాయిలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.



వామ్మో.. ఎంత పెద్ద లారీ

సాధారణంగా నాలుగు, ఆరు చక్రాల లారీలను చూస్తుంటాం... అప్పుడప్పుడూ పది, పదహారు చక్రాల లారీలనూ చూసుంటాం. కానీ మంగళవారం తడలో 50 చక్రాల లారీ అందరినీ ఆకర్షించింది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూర్కెలా నుంచి తడ మీదుగా చెన్నైకు భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్తున్న 50 చక్రాల చక్రాల లారీ తడలో కొంతసేపు ఆగింది. లారీపై భారీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో జనం ఆసక్తిగా గమనించారు.

- తడ, ఆంధ్రజ్యోతి

భక్తులతో మర్యాదగా నడుచుకోండి: సీఐ



ట్యాక్సీ డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ హరిప్రసాద్

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో ప్రతి ట్యాక్సీ డ్రైవర్ మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, దురుసుగా మాట్లాడినట్టు ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తిరుమల ట్యాక్సీ డ్రైవర్లను హెచ్చరించారు. తిరుమలలోని శిలాతోరణం, శ్రీవారిపాదాల వద్దనున్న పార్కింగ్ ప్రదేశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడి డ్రైవర్లతో మాట్లాడారు.

ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

భాకరాపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు స్త్రీశక్తి భవన్‌లో మంగళవారం ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామ్మోహన్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చిరునామాలు, ఫొటోలు ఒక్కోసారి మారిపోతాయని, బీఎల్‌వోలు గుర్తించి సరిచేయాలన్నారు. ఏటా ఓటరు జాబితాను నవీనీకరించాలన్నారు. చనిపోయిన వారి పేర్లు తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, పరమేశ్వర స్వామి, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

భాకరాపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ పురోగతి సూచికపై కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పేదల అభ్యున్నతి కోసం వారికి మెరుగైన జీవనోపాధి కల్పించడం, అన్ని వయస్సుల వారికి ఆరోగ్యంగా జీవించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, ఏపీఎం స్వర్ణలత, ఏవో ధనలక్ష్మి, వైద్యాధికారి నవాజ్ మజీద్, రిసోర్స్ పర్సన్ హరి పాల్గొన్నారు.

పీటీఎం సమావేశాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంఈవో బాబ్జీ

పాకాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అన్ని పాఠశాలల్లో గురువారం మోగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు(పీటీఎం) ఘనంగా నిర్వహించాలని ఎంఈవో బాబ్జీ కోరారు. మంగళవారం మండలంలోని ఉపాధ్యాయులతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు పిల్లల ద్వారా పంపిణీ చేయాలన్నారు. ప్రతి విద్యార్థితో మొక్క నాటించి సంరక్షణా బాధ్యత తీసుకునేలా ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ఎంఈవో 2 లింగయ్య, ప్రధానోపాధ్యాయులు కుమార్ రెడ్డి, సుమతమ్మ, సుమలత, జయచంద్ర సీఆర్పీలు పాల్గొన్నారు.

వైభవంగా బాలగుర్రప్ప స్వామి ఉత్సవాలు

భాకరాపేట, జూలై 8(ఆంధ్రజ్యోతి): లంకిపల్లెవారిపల్లెలోని బాల గుర్రప్ప స్వామి ఏకాదశి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి గుర్రప్ప స్వామి, అంకమ్మ, ఎల్లమ్మ విగ్రహాలను బావి వద్దకు తీసుకెళ్లి జలాది యాగం నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. మంగళవారం ఉదయం పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



వైఆర్‌కండ్రిగలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా టీడీపీ సంక్షేమ పథకాలను అందిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోరా హరిప్రసాద్‌నాయుడు అన్నారు. కొత్తకండ్రిగ పంచాయతీ వైఆర్‌కండ్రిగలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో చేపట్టిన పథకాలను వివరించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దినేష్‌నాయుడు, దొరస్వామినాయుడు పాల్గొన్నారు.

చెత్తరహిత పంచాయతీలే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈవో రవికుమార్

తిరుపతి రూరల్, జూలై8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను చెత్తరహితంగా తీర్చిదిద్దే క్రమంలో మంగళవారం రామానుజపల్లె గ్రామాన్ని జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తరహిత గ్రామపంచాయతీల ఏర్పాటు, చెత్తనుంచి సంపద తయారీ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలు తడి,పొడిచెత్తలు వేర్వేరుగా రెండు బుట్టలలో అందించేలా మహిళలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రామచంద్ర, డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించారు..న్యాయం చేయండి



పట్టాదారు పాసుపుస్తకం, స్కెచ్ చూపుతున్న లీలావతి

చంద్రగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో తనను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఓ మహిళ వాపోయింది. బాధితురాలు లీలావతి కథనం మేరకు ఎం.కొంగరవారిపల్లెలో సర్వే నెంబర్ 536బీ-2సీలో ఈమెకు 10 సెంట్ల భూమి భూమి ఉంది. ఇందుకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం కూడా ఈమె మామ రామచంద్రనాయుడు పేరుతో రెవెన్యూ అధికారులు ఇచ్చారు. అయితే గ్రామానికి చెందిన తలారి రాజేశ్వరి ఆభూమిని కబ్జా చేసి ఇబ్బందులు పెడుతోందని లీలావతి ఆవేదన వ్యక్తం చేసింది. ఇది వరకే తమపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా పెట్టిందన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆమె కోరింది.

తహసీల్దారు లేక ధ్రువపత్రాల జారీకి ఇక్కట్లు

రామచంద్రాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలానికి కొద్ది రోజులుగా తహసీల్దారు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు వెంకటరమణ ఇటీవల రిటైరయ్యారు. అప్పటినుంచి ఇన్‌ఛార్జిని కూడా నియమించలేదు. వివిధ ధ్రువపత్రాల కోసం రైతులు, విద్యార్థులు కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. ఇంజనీరింగ్ కోర్సుల కౌన్సిలింగ్ నేపథ్యంలో కొన్ని ధ్రువపత్రాలు అవసరం. కౌన్సెలింగ్ లోపు వీటిని అందించలేకపోతే విద్యాసంవత్సరం కోల్పోతామని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కలెక్టర్ స్పందించి డిప్యూటీ తహసీల్దారును అయినా ఇన్‌ఛార్జిగా నియమించాలని కోరుతున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



అజయ్ కుమార్

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు నవీన్, రాంబాబు, దేవి, ఐపీఎస్ అధికారి బింధు దర్శించుకున్నారు.

స్కూటరిస్ట్ మృతి



మృతి చెందిన సుబ్రహ్మణ్యం

రామచంద్రాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి -పచ్చికాపల్లం ప్రధాన రహదారి గంగిరెడ్డిపల్లి మలుపు వద్ద మంగళవారం సాయంత్రం స్కూటరిస్టు అదుపు తప్పి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం ఆచారి(50) స్కూటర్‌పై మంగళవారం మధ్యాహ్నం బయలుదేరాడు. గంగిరెడ్డి మలుపు వద్ద స్కూటర్ అదుపుతప్పడంతో స్పృహ తప్పాడు. గ్రామస్థులు 108 ద్వారా తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

చంద్రగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు మంగళవారం వాకాడు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్‌ను మండలం పరిధిలోని టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను సీజ్ చేసి, చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రేపు హజరత్ షేక్ ఫరీద్ మస్తాన్ ఔలియా ఉరుసు

పాకాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక హజరత్ షేక్ ఫరీద్ మస్తాన్ ఔలియా దర్గా వద్ద గురు, శుక్రవారాల్లో ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రి 7 గంటలకు దర్గావద్ద నుంచి గంధం ఊరేగింపుగా తీసుకువస్తారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు ఉరుసు ఉత్సవం జరుగుతుందన్నారు. రెండు రోజులు రాత్రుల్లో ఖవాలీ గాయకులచే పాట కచ్చేరి జరుగుతుందన్నారు. దర్గా వద్ద ఘనంగా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గంగమ్మజాతర

తిరుపతి అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని తిరుమలనగర్ గ్రామపంచాయతీ జయశంకర్‌కాలనీలో మంగళవారం నడివీధిగంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. స్థానికులు ఉదయం అమ్మవారికి అంబళ్లు, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పోలీసుల విస్తృత సోదాలు



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ సునీల్‌కుమార్

తిరుచానూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో నిషేధిత గుట్కాలు, పాన్ మసాలాలు విక్రయిస్తే కేసులు పెట్టి జైలుకు ఎంపుతామని సీఐ సునీల్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం తిరుచానూరులోని జడ్పీ హైస్కూల్, ఆలయ పరిసరాల్లో దుకాణాల్లో పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. పలుచోట్ల హన్స్, పాన్‌పరాగ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారులను హెచ్చరించారు.

ధర్మరాజస్వామి ఆలయంలో కుంభం



శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో కొలువై ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం కుంభం జరిగింది. ధ్వజావరోహణం మర్నాడు స్వామిఅమ్మవార్లకు కుంభం వేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంభం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముక్కంటి ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ అర్చకుడి శివైక్యం



సురేష్ (ఫైల్ ఫొటో)

నారాయణవనం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరణ్యం కండ్రిగ పంచాయతీలోని కైలాసనాథ కోన ఆలయ అర్చకుడు సురేష్(45) అనారోగ్యంతో సోమవారం రాత్రి శివైక్యం చెందారు. కామాక్షి సమేత కైలాసనాథ స్వామి ఆలయంలో ఆయన సేవలందించారు. అయన శివైక్యం చెందడం పట్ల జిల్లాలోని బ్రాహ్మణ సంఘాలు సంతాపం వ్యక్తం చేశాయి. బ్రాహ్మణ సంఘ రాష్ట్ర యువజన అధ్యక్షుడు వేదం హరిప్రసాద్, జిల్లా అధికారి ప్రతినిధి కె.బాలాజీ శర్మ, గాయత్రీ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు ఆలూరు రామకృష్ణ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

మామిడి రైతులు నష్టపోకుండా చర్యలు

గుడిపాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ మ్యాంగో ఫ్యాక్టరీ వద్ద బారులు తీరిన మామిడి ట్రాక్టర్ల వద్ద రైతులతో మాట్లాడారు. మామిడి తోటల్లో ఎంత కాపు మిగిలి ఉందని అడిగి తెలుసుకున్నారు. రైతుకు చెందిన చివరి మామిడి కాయను అమ్మేవరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతులెవరూ కూడా అధైర్యపడవద్దని చెప్పారు. ఫ్యాక్టరీల వద్ద ఏమైనా ఇబ్బందులు ఉంటే తహసీల్దార్ ద్వారా తనకు తెలియజేయాలని కోరారు. రోడ్డు పక్కన ట్రాక్టర్లు, లారీలు నిలిపినపుడు ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక ఎస్ఐకి ఫిర్యాదు చేయాలన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణానికి ప్రాణం

జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



మొక్కను నాటుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రామచంద్రాపురం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మొక్కలే మూలాధారమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కుప్పంబాదూరు సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమంలో మొక్కల పెంపకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయనకు ఆశ్రమ నిర్వాహకులు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటశ్వర్ మాట్లాడుతూ అడవుల్లో మొక్కల పెంపకానికి ముందుకు వచ్చిన ప్రాణయోగ ఆశ్రమ పీఠాధిపతి కైలాష్‌గూరూజీకి అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని పెంపనకు కృషి చేస్తే పర్యావరణ పరిరక్షణ... సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. ప్రాణయోగా ఆశ్రమం ఆధ్వర్యంలో రావి, మర్రి మొక్కలను నాటారు. కైలాష్ గూరూజీ మాట్లాడుతూ మొక్కలు నాటితే భూమికే కాదు జీవాత్మకు మహోన్నతమైన ఉపయోగం ఉంటుందన్నారు. ఆశ్రమ నిర్వాహకులు తెలంగాణ, తమిళనాడు, డిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వేలాది మందికి యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక దైవచింనలపై చక్కటి అవగాహన కల్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఐఆర్ఎస్ అధికారి పాయల్ గుప్తా, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణరాజు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్‌నాయుడు, ఎంపీడీవో ఇందిరమ్మ, డీటీ అన్వర్‌బాషా, ఏపీవో సుజాత, వ్యవసాయశాఖ అధకారిణి మమత, వీఆర్వో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు పెంచని ప్రభుత్వం మాది : ఎమ్మెల్యే నాని



మహిళకు కరపత్రాల అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలన విద్యుత్ బిల్లులు పెంచకుండా సాగిందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం ఉదయం తిరుమలనగర్ పంచాయతీపరిధిలోని పర్యటించారు. తొలుత రాజరాజేశ్వరీదేవి ఆలయంలో సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ప్రతి ఇంటిని సందర్శించి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వం అమలుచేసిన, ప్రవేశపెట్టబోతున్న పథకాలను వివరించారు. స్థానిక సమస్యల్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వరయ్య, పెరుగు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులయాదవ్, గోవిందరాజులు, జనార్ధన్, గోపీనాధ్, మహేశ్వరి, చంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే నాని

ఎమ్మెల్యే పులివర్తి నాని తిరుమలనగర్ పంచాయతీ కార్యాలయం రోడ్డుకు ఇరువైపులా ఉపాధి హామీ పథకం కింద వివిధ రకాల మొక్కలు మొక్కలు నాటారు. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ చిన్నరెడ్డెప్ప , అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ జ్యోతి, సచివాలయ కార్యదర్శి ఎ.మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూమన హయాంలోనే అనధికార తట్టలు

● తొలగింపునకు టీడీపీ నేతల విజ్ఞప్తి



వెంకయ్య చౌదరికి వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నేతలు

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే తట్టల ఏర్పాటుకు నగదు లావాదేవీలు జరిగాయని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధరవర్మ పేర్కొన్నారు. మంగళవారం వారు తిరుమలలో అదనపు ఈవో వెంకయ్య చౌదరిని కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 2019 వరకు ఎలాంటి అనధికార తట్టలు లేవన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక మాజీ ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, ఆయన కుమారుడు సహకారంతో తట్టల లావాదేవీలు జరిగాయన్నారు. ఇందులో అనేక మంది స్థానికేతరులు ఉన్నారన్నారు .వెంటనే అనధికార తట్టలను తొలగించాలని వినతి పత్రం అందజేశారు. వారి ద్వారా శాంతిభద్రతలకు కూడా విఘాతం కలిగే అవకాశాలున్నాయన్నారు. నిజమైన స్థానికులు, దుకాణదారులను ఇబ్బంది పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు స్వాధీనం పరుచుకున్న లక్షలాది వస్తువులను తిరిగి దుకాణదారులకు అందజేశాయని కోరారు.

టెక్నాలజీ సాయంతో శీఘ్ర దర్శనానికి చర్యలు

● అధికారులను ఆదేశించిన టీటీడీ ఈవో

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ సాయంతో నిర్దేశించిన సమయానికి భక్తులకు శ్రీవారి దర్శనమయ్యేలా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పరిపాలన భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి మంగళవారం టీసీఎస్ ప్రతినిధులు, టీటీడీ ఐటీ విభాగం అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ..బ టెక్నాలజీని ఉపయోగించి దర్శనం సులభతరమయ్యేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ అంశంపై నిర్దిష్ట నిర్ణయానికి వచ్చేముందు టీసీఎస్ ప్రతినిధులు, టీటీడీ ఐటీ విభాగంతో కూడిన ప్రతినిధులు తరుచూ సమావేశాలు నిర్వహించి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. సాంకేతిక మారుతున్న మార్పులకు అనుగుణంగా క్యూఆర్ కోడ్, ఫేస్ రికగ్నిషన్ ద్వారా సమయాన్ని ఆదా చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. నిర్దేశించిన సమయానికి భక్తులు దర్శనానికి వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. దీంతో సమయం ఆదా కావడంతో పాటు సంతృప్తికరమైన దర్శనం కల్పించవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై టీసీఎస్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో ఐజీ జీఎం శేషారెడ్డి, ఏజీఎం వెంకటేశ్వర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు

● రూ.15 కోట్లతో పద్మావతి ఉమెన్ హాస్టల్ నిర్మాణం



అధికారులతో పూర్వ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందిస్తూ ఉన్నారు. రూ. 16 కోట్లతో 500 మంది విద్యార్థినులకు వసతి సామర్థ్యంతో ప్రత్యేక హాస్టల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థినుల కోసం పద్మావతి ఉమెన్ హాస్టల్ భవనాన్ని పూర్వ విద్యార్థుల సంఘం నిర్మాణం చేపట్టింది. ఈ భవన నిర్మాణ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఆగస్టు 15 వ తేదీ నుంచీ ఈ హాస్టల్ భవనాన్ని విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడును పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు మంగళవారం కలిశారు. పూర్వ విద్యార్థులకు యూనివర్సిటీ పట్ల ఉన్న ప్రేమకు ఈ భవన నిర్మాణం నిదర్శనమని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులందరికీ యూనివర్సిటీ పక్షాన వారు కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్రొఫెసర్ దామోదరరెడ్డి, ప్రొఫెసర్ కేఎం భాను, ప్రొఫెసర్ హేమ పాల్గొన్నారు.

అనుచితంగా ప్రవర్తించారంటూ రుసరుస

●భక్తురాలికి ఆలయ అధికారుల సముదాయింపు

తిరుచానూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయంలో దర్శనం సందర్భంగా ఓ అధికారి అనుచితంగా ప్రవర్తించారని ఓ భక్తురాలు ఆగ్రహం వెలిబుచ్చింది. మంగళవారం ఉదయం ఓ పోలీసు అధికారి సిఫార్సుతో ఓ కుటుంబం దర్శనానికి వచ్చింది. బ్రేక్ సమయం కావడంతో క్యూలైన్లలో భక్తులను త్వరగా ముందుకు కదలాలంటూ విధి నిర్వహణలో ఉన్న ఓ అధికారి చెప్పారు. ఈ క్రమంలో సదరు అధికారి అనుచితంగా ప్రవర్తించారని ఆ కుటుంబ మహిళ ఆలయం వద్ద కన్నీటిపర్యంతమైంది.

ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డిప్యూటీ హరిందర్‌నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకుడు బాబుస్వామి వెళ్లి సదరు మహిళకు నచ్చజెప్పారు. తిరిగి దర్శనం చేయించి పంపించారు. సదరు అధికారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా బ్రేక్ సమయంలో త్వరగా వెళ్లాలని సూచించడంతో వివాదం తలెత్తిందన్నారు.

రాజకీయ లబ్ధికే జగన్ యాత్రలు: ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి యాత్రలు, ఓదార్పులు చేస్తున్నారని ఎమ్మెల్యే భానుప్రకాష్ విమర్శించారు. కాకవేడులో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పూర్తయ్యాక ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి రైతులకు ఏమి చేయడానికి బంగారుపాళ్యం వస్తున్నారని, గత ఐదేళ్లలో రైతులకు ఆయన చేసిందేమిటని ప్రశ్నించారు. నేడు మామిడి రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.300 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఒకప్పుడు రోజా రూ.2000 కోసం ఏపనైనా చేసేవారని, నేడు రెండు వేలకోట్లు ఎలా వచ్చాయో నగరి ప్రజలకు తెలుసన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మట్టి అమ్మకాల వీడియోలున్నాయని, ఆమె నేడు మట్టి తరలిస్తున్నారని అరవాల్సిన అవసరం లేదన్నారు. నేడు ఎక్కడైనా మట్టి అక్రమంగా తరలిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. కేవలం జాతీయ రహదారులకు మట్టిని తీసుకెళుతుంటే నోటికొచ్చినట్లు రోజా మాట్లాడటం సబబు కాదని, వయస్సు మీరాకైనా మంచిగా మసలుకోవాలని సూచించారు.

బాలగంగమ్మ జాతర



తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం2(మాధవనిలయం) వద్ద బాలగంగమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తిరుమల, తిరుపతి స్థానికులు అమ్మవారి ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. రాత్రి అమ్మవారి జాతరను నిర్వహించార్ను అమ్మవారిని స్థానికులతో పాటు శ్రీవారి భక్తులు కూడా దర్శించుకున్నారు. నిర్వాహకులు దయానాయుడు, విజయ నాయుడు, కృష్ణ తదితరులు దగ్గరుండి దర్శనం కల్పించడంతో పాటు ప్రసాదాల వితరణ చేశారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



రామచంద్రాపురం: జూలై 8(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో దుప్పి మృతి చెందింది. ఎన్ఆర్‌కమ్మపల్లి గ్రామ సమీప అడవి నుంచి పొలానికి నీటి దాహం తీర్చుకోవడానికి మంగళవారం మధ్యాహ్నం దుప్పి వచ్చింది. గమనించి కుక్కలు గుంపులుగా దాడిచేసి కరిచి చంపేశాయి. అటవీశాఖ అధికారులకు గ్రామస్థులు సమాచారం ఇచ్చారు. పశువైద్యాధికారి భువనేశ్వరి దుప్పికి పోస్టుమార్టం నిర్వహించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీట్ సెక్షన్ అధికారి తులసయ్య దీనిని ఖననం చేశారు.

ఘనంగా వైఎస్ జయంతి



పండ్లు పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద మంగళవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రెడ్డి తనయుడు హర్షిత్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీహెచ్‌సీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మల్లం చంద్రమౌళిరెడ్డి, యారాశి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ ఆర్టీఐ ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై8(ఆంధ్రజ్యోతి): వైసీపీ చిత్తూరు జిల్లా ఆర్టీఐ విభాగ ప్రధాన కార్యదర్శిగా రూరల్‌మండలం చిగురువాడ గ్రామానికి చెందిన వేమూరి ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. పలువురు ఆయనను అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ద్రాక్షారామాంనరరికి చెందిన సీతామహాలక్ష్మి రూ.50వేలు విరాళంగా అందజేశారు. దాతకు అధికారులు కృతజ్ఞతలు తెలిపి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

మెరుగైన సేవలు అందిద్దాం: డీపీటీవో



డీపీటీవో జగదీష్‌ను సన్మానిస్తున్న ఈయూ కమిటీ ప్రతినిధులు

తిరుపతి (ఆర్టీసీ), జూలై 8(ఆంధ్రజ్యోతి): కలసికట్టుగా పనిచేస్తూ సంస్థను కాపాడుకుంటూ ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందిద్దామని ప్రజారవాణాధికారి ఎం.జగదీష్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో, సభ్యులతో పేర్కొన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన్ను ఎంప్లాయిస్ యూనియన్ మంగళవారం సన్మానించింది. పలువురు నాయకులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమన్వయంతో మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలియజేశారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచితప్రయాణం, బ్రహ్మోత్సవాలు మన ముందున్న పెద్ద సవాలు అని వాటిని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం డీపీటీవోకు శాలువకప్పి, గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎంఈ బాలాజీ, ఏటీఎం భాస్కర్, ఈయూ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఆవులప్రభాకర్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అర్జున, రాష్ట్ర కార్యదర్శి ఈ.ఆర్.కుమార్, సహాయకార్యదర్శి మురగమ్మ, జిల్లా గౌరవ అధ్యక్షులు టి.సత్యనారాయణ, అధ్యక్షులు జి.ఆర్.చంద్ర, కార్యదర్శి వి.మస్తాన్, ప్రచార కార్యదర్శి జె.సతీష్‌నాయుడు, జోనల్, జిల్లా కమిటీ సభ్యులు, అన్ని డిపోల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

చతుర్వేద పండితులకు ఘన సత్కారం



చతుర్వేత పండితులకు సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక శృంగేరి శంకర మఠంలో మంగళవారం ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో చరుర్వేద పండితులను ఘనంగా సత్కరించారు. రుగ్వేద పండితులు బ్రహ్మశ్రీ చందూరి సీతారామశర్మ, యజుర్వేద పండితులు బ్రహ్మశ్రీ ద్వైత మల్లికార్జున, సామవేద పండితులు బ్రహ్మశ్రీ వి.గణేష్‌శ్రౌతి, అధర్వణ పండితులు బ్రహ్మశ్రీ డాక్టర్ బలభద్రలను ప్రత్యేక వేదికపై ఆశీనులు చేసి పూజలు చేశారు. అనంతరం వారినుంచి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పొదిల నారాయణమూర్తి, సంస్కార్ ట్రస్టు అధ్యక్షులు రాజేష్, వందవాసి మహేష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులను జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుదాం



కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసిన శాప్ డైరెక్టర్ రజని

తిరుపతి(కలెక్టరేట్), జూలై 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులను జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ప్రముఖ హాకీ క్రీడాకారిణి, శాప్ డైరెక్టర్ రజని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఉన్న 6నుంచి 8 సంవత్సరాల వయసు గల పిల్లలను వారిలో ప్రతిభను గుర్తించి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. వచ్చే నెల మొదటివారంలో పిల్లలకు ప్రతిభాసామర్థ్యం నిర్వహించి చంద్రగిరిలో క్రీడా సౌకర్యాలు ఏర్పాటు చేసి వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ జిల్లా అధికారి భరత్, డీఎస్‌డీవో శశిధర్, హాకీ కోచ్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. అంతకు మునుపు జిల్లాలోని విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యంపెంచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశంపై రజనితో చర్చించారు.

25 ఎకరాల భూమిని టూరిజానికి ఇవ్వొద్దు



టీటీడీ ఈవోకు వినతి పత్రం అందజేస్తున్న తుమ్మ ఓంకార్, నీలకంఠ, సురేష్‌నాయక్, అశోక్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ స్థలాన్ని టూరిజానికి ఇవ్వొద్దని తిరుక్షేత్రాల్ రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మ ఓంకార్, హిందూ సంఘాల నాయకులు నీలకంఠ, సురేష్‌నాయక్, అశోక్ కలసి టీటీడీ ఈవో శ్యామలరావుకు విన్నవించారు. ఒబెరాయ్ గ్రూప్స్ అలియాస్ ముంతాజ్ హోటల్ వారికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయడంతో యావత్తు హిందూ సమాజం సంతోషిస్తోందన్నారు. అయితే సర్వేనెంబర్ 604 పేరూర పంచాయతీ పరిధిలో ఉన్న 25 ఎకరాల భూమిని టీటీడీ తీసుకుందని, అదే సమయంలో సర్వేనెంబర్ 588ఏలో ఉన్న 24ఎకరాల టీటీడీ స్థలాన్ని టూరిజానికి అప్పగించడంపై శ్రీవారి భక్తులుగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కూతవేటు దూరంలో నాలుగు ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలున్నాయని, వాటిపక్కనే ప్రైవేటు హోటల్స్ నిర్మిస్తే బార్ అండ్ రెస్టారెంట్ పెడుతారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో కాకుండా మరెక్కడైనా కేటాయించాలని కోరారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



సమ్మె పోస్టర్లు విడుదల చేస్తున్న యూనియన్ నేతలు

తిరుపతి(వైద్యం), జూలై 8(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల పరిరక్షణ కోసం బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట మహేంద్ర పిలుపునిచ్చారు. రుయాస్పత్రిలో యూనియన్ నేతలు, సెక్యూరిటీ, పారిశుధ్య కార్మికులతో కలిసి ఆయన మంగళవారం సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు కిశోర్, సునీల్, రూపాదేవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

తిరుపతి(ఆటోనగర్), జూలై8(ఆంధ్రజ్యోతి): పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో తిరుపతి ఎల్‌బీసీ రోడ్డులోని విద్యోదయ ఎడ్యుకేషనల్ సెంటర్‌లో బుధవారం నుంచి అసిస్టెంట్ యోగా టీచర్స్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నట్లు రితేదేవ్‌జీ వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం పరతి ఒక్కరూ యోగా చేయాలని కోరారు. ఈ శిక్షణ 25 రోజుల పాటు వుంటుందన్నారు. ఈ శిక్షణపూర్తి చేసిన వారికి హరిద్వార్‌లో మరో 10 రోజులు రామ్‌దేవ్ బాబా వారిచే శిక్షణ ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కైలాష్ సింగ్, సోమేశ్వర్, హరి, ఉమ, రాధిక పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



వసుధప్రియ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 8 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగ పరిశోధకురాలు ఎస్.పి.వసుధప్రియ డాక్టరేట్ పొందారు. ఇంప్లిమెంటేషన్ ఆఫ్ సీసీఈ ఇన్ ప్రైమరీ స్కూల్స్ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ ఇన్ రిలేషన్ టు టీచర్స్ అవేర్నెస్ - యాటిట్యూడ్ అండ్ స్ట్రెస్ అంశంపై ప్రొఫెసర్ సునీతాబాయి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

పేద, అనాథ బాలికలకు ఉచిత విద్య

తిరుపతి(ఆటోనగర్), జూలై8(ఆంధ్రజ్యోతి): పేద, అనాథ బాలికలకు సమగ్ర శిక్ష సహకారంతో ఉచిత విద్య అందిస్తామని రియల్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.క్రిష్ణమూర్తి వెల్లడించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తల్లిదండ్రులు లేని అమ్మాయిలకు, తండ్రిలేని పేద ఆడపిల్లలకు తమ సంస్థ 10వ తరగతి వరకు అన్ని వసతులు కల్పించి విద్యను అందించడానికి సహకరిస్తుందని చెప్పారు. అర్హులైన వారు జీవకోన క్రాంతినగర్‌లోని తమ సొసైటీని సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ముబారక్ బాషా, ఉమామహేశ్వరి, గిరిజ పాల్గొన్నారు.

నల్లప్పరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని సస్పెండ్ చేయండి

డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ

తిరుపతి(ఆటోనగర్), జూలై8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని అగౌరవంగా మాట్లాడిన నల్లప్పరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నల్లప్పరెడ్డి వెంటనే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని కోరారు. మహిళలను అగౌరపరిచేలా మాట్లాడిన ఇలాంటి నాయకులపై ప్రభుత్వం నాన్ బెయిలబుల్ కేసులు నమోదుచేయాలన్నారు. రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యే పట్ల అనుచితంగా మాట్లాడటం గర్హనీయమన్నారు. ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్తులో మహిళలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి



తిరుపతి(వైద్యం), జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ముందు మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు, నేతలు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, శివశంకర్, సుప్రజ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై సంతృప్తిగా ఉన్నాం

- తొలిఅడుగులో నేతల ముందు ప్రజల హర్షం



తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నేతలు

తిరుపతి, జూలై8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై సంతృప్తిగా ఉన్నామని ప్రజలు టీడీపీ నేతల ముందు సంతోషం వ్యక్తం చేశారు. ఏడాదిపాలన పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం తొలి అడుగు కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో 30వ డివిజన్‌లో జరిగింది. ఏడాదిలో జరిగిన సుపరిపాలన గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, అర్బన్ ఫైనాన్స్ డెవలప్మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ఊకా విజయకుమార్, నాయకులు శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్, మహేష్‌యాదవ్, ఆముదాల తులసీరాం, డివిజన్ నాయకులు మునికృష్ణ, రేఖ, శ్రీనివాసులు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు

తిరుపతి(క్రీడలు), జూలై 8(ఆంధ్రజ్యోతి): మంగళం ట్రెండ్స్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా బేస్‌బాల్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో సుమారు 150మంది క్రీడాకారులు పాల్గొనగా, ఇందులో రాణించిన 18మంది బాలికలు, 18మంది బాలురను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేవారు. ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు, బేస్‌బాల్ అసోసియేషన్ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు సోమురవికుమార్, సాంబశివరావు, ప్రకాష్, ఉపాధ్యాయులు నూరుద్దీన్, నందకుమార్, ప్రసంగి రామచంద్రయ్య, శ్రీధర్, పీపుల్ చారిటబుల్ అధ్యక్షులు మోహన్ తదితరులు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ నెల 12నుంచి 14వ తేదీ వరకు సత్యసాయిజిల్లా కదిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.



ఎంపికైన బాలుర జట్టు

రేపు గంగమ్మ ఆలయంలో చండీహోమం

తిరుపతి అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా గురువారం స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ప్రాంగణంలో చండీహోమం నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 11.30గంటల వరకు హోమం జరగనుంది. ఆసక్తిగల భక్తులు బుధవారం నుంచే ఆలయంలోని కౌంటర్ వద్ద రూ. వెయ్యి చెల్లించి గోత్రనామం నమోదుచేసుకొని రశీదు పొందవచ్చు. హోమానికి హాజరయ్యే సమయంలో భక్తులు సంప్రదాయ దుస్తులతో రావాల్సి వుంటుంది. మరిన్ని వివరాల కోసం 0877-2220766, 9888666679నెంబర్లను సంప్రదించాలని ఆలయ ఈవో జయకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా ఎంఎస్ స్వామినాథన్ శతజయంతి



విజేతలకు బహుమతులు అందజేసిన రాజగోపాల్

మంగళం, జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో సొసైటీ ఫర్ హంగర్ ఎలిమినేషన్ సహకారంతో మంగళవారం ఎంఎస్ స్వామినాథన్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భారతీయ హరిత విప్లవం, వ్యవసాయం అనే అంశంపై క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మాజీ డైరెక్టర్ రాజగోపాల్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రం, గ్రామీణ అభివృద్ధిలో ఎంఎస్ స్వామినాథన్ చేసిన విప్లవాత్మక పరిశోధనల గురించి వివరించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ, ఎడ్యుకేషన్ ఆఫీసర్ పురుషోత్తం పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి



తిరుపతి(జీవకోన), జూలై 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తుడా సర్కిల్ వద్ద ఘనంగా నిర్వహించారు. శ్రేణుల మధ్య కేక్ కట్ చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ శిరీష, నియోజకవర్గ సమన్వయకర్త అభినయ్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యకురాలు మాధవిరెడ్డి, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టెండర్లు వాయిదా

తిరుపతి, జూలై8(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించాల్సిన వినాయక సాగర్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇతర దుకాణాల వేలం టెండర్లను వాయిదా వేస్తున్నట్టు కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే తిరిగి టెండర్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు

- 96 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి(నేర విభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో అంతర్‌రాష్ట్ర దొంగను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు తమిళనాడులోని తిరవళ్లూరు జిల్లాకుచెందిన భరద్వాజస్ ప్రేమకుమార్ కొంతకాలంగా తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. పలుమార్లు జైలుకు కూడా వెళ్లొచ్చాడు. ఈక్రమంలోనే తాజాగా స్థానిక అవిలాల చెరువు వద్ద మంగళవారం నిందితుడు పట్టుబడ్డాడు. అతని నుంచి 96 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్టులో ప్రతిభ కనబరచిన సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ రామకృష్ణ, ఆరీఫ్, ప్రసాద్, మోహన్‌కుమార్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించి రివార్డులు అందజేశారు.

పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



రైతు మునికృష్ణయ్యతో కలసి కొబ్బరిమొక్కను నాటుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి రూరల్, జూలై8(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల పెంపకాన్ని చేపట్టే చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా మంగళవారం గ్రామానికి చెందిన రైతు మునికృష్ణయ్య పొలంలో ఆయన కొబ్బరిమొక్కలు నాటారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ..జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లాలో పెద్దఎత్తున్న పండ్లతోటల పెంపకాన్ని చేపడుతున్నామన్నారు. 5ఎకరాలలోపు ఉన్న ఎస్సీఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు ఈపథకానికి అర్హులన్నారు. జిల్లాలో మంగళవారం 500ఎకరాల్లో కొబ్బరిమొక్కలు నాటడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈపథకం కింద రైతులకు నచ్చిన పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చునన్నారు. నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.మామిడిపంటలే కాక తైవాన్‌జామ, డ్రాగన్, కొబ్బరి, నిమ్మ వంటి పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్, ఎంపీడీవో రామచంద్ర, ఏపీవో జ్యోతిశ్రీ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీడీపీజిల్లా ప్రధానకార్యదర్శి మునిశేఖర్‌రాయల్, నాయకులు బాబురాయల్, రవి తదితరులు పాల్గొన్నారు.

తండ్రిపై కొడుకు కత్తితో దాడి



దాడిలో గాయపడిన తండ్రి

తిరుపతి(నేరవిభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): కత్తితో దాడి చేసి తండ్రిని తీవ్రంగా గాయపరిచాడో కుమారుడు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు ఐరాల మండలం గురవారంపల్లెకు చెందిన బాబు తిరుపతిలోని ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఇతనికి, కుమారుడు సంతోష్ మధ్య మనస్పర్ధలున్నాయి. సంతోష్‌కు మానసిక స్థితి కూడా సరిగా లేదు. ఈక్రమంలో మంగళవారం డీబీఆర్ ఆస్పత్రి సమీపంలో తండ్రిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాబును స్థానికుల సహాయంతో రుయా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ తగాదా వల్ల కొడుకు దాడి చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బడుల వద్ద అంగళ్లలో గుట్కా, సిగరెట్ల విక్రయాలపై తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా స్కూళ్ల సమీపంలోని అంగళ్లలోని మంగళవారం ఈగల్ టీం, పోలీసు సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేశారు. కొన్నిచోట్ల గుట్కాలు, సిగరెట్లు విక్రయించే వారిని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయించిన వారికి రూ.200 జరిమానా విధించారు. 59 కేసులు నమోదు చేశారు. విద్యార్థి దశలో చేడు వ్యసనాలకు బానిసలుగా కాకుండా వారిని రక్షించుకునేలా అందరూ బాధ్యత వహించాలని సూచించారు. స్కూల్, కాలేజీల వద్ద అంగళ్లలో తినుబండారాలు మాత్రమే అమ్మాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గుట్కాలు, సిగరెట్లు విక్రయించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఈగల్ టీం సీఐ ప్రసాద్, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో రేమాండ్ సీఎండీ



గౌతమ్ హరి సింఘానియా

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళ వారం రేమాండ్ గ్రూప్స్ సీఎండీ గౌతమ్ హరి సింఘానియా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఫోను హ్యాక్ చేసి రూ.10.45 లక్షలు కొట్టేసి

- పీఎం కిసాన్ యోజన పేరిట వచ్చిన ఫైల్ ఓపెన్ చేయడంతో నష్టం

తిరుపతి (నేరవిభాగం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసానికి చిరుద్యోగి రూ.10.45 లక్షలు నష్టపోయారు. ఐరాల మండలం కొత్తపలికి చెందిన రాజాశెట్టి తిరుపతిలో నివాసం ఉంటూ.. ఓ బంగారు షాపులో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. జూన్ 30వ తేదీన వాలంటీర్ విలేజ్ గ్రూపులో పీఎం కిసాన్ యోజనకు సంబంధించి ఒక ఫైల్ రాగా ఓపెన్ చేశారు. దీంతో ఇతడి ఫోను హ్యాక్ అయ్యి పనిచేయకుండా పోయింది. ఆ తర్వాత త ఫోనును జూలై 4న బాగు చేయించుకున్నారు. ఆ వెంటనే ఫోన్ పే ద్వారా రూ.45 వేలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్ కార్డు నుంచి రూ.పది లక్షలు వివిధ లావాదేవీల ద్వారా ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వెస్ట్ సీఐ మురళీ మోహన్‌రావు తెలియజేశారు.

ముగిసిన జ్యేష్టాభిషేకం





తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన కవచ సమర్పణ క్రతువుతో జ్యేష్టాభిషేకం ముగిసింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని మండపంలోకి వేంచేపుచేశారు. వివిధ క్రతువులు నిరవహించారు. శాత్తుమొర, ఆస్థానం జరిపించి మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30గంటల మధ్య స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కవచ సమర్పణ పూర్తిచేశారు. సాయంత్రం ఉభయనాంచారులతో స్వామివారు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చివరిరోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవర్లను దర్శించుకున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

అమ్మవారి సేవలో చెన్నై హైకోర్టు సీజే



ఆలయం వద్ద జస్టిస్ కేఆర్ శ్రీరామ్

తిరుచానూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి):పద్మావతి అమ్మవారిని మంగళవారం చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం తమిళనాడు బీజేపీ నేత అన్నామలై కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.48 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,081
తలనీలాలు సమర్పించినవారు: 28,775



చరమాంకంలోనూ చెదరని సంకల్పం

● పురాతన కరెన్సీ, నాణేల సేకరణ హాబీ ● 75 ఏళ్ల వయసొచ్చినా అదే అభిరుచి



కణన్ షణ్ముగం, సేకరించిన నాణెలు, కరెన్సీ

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 75ఏళ్ల వయసులోనూ తన అభిరుచి కోసం పరితపిస్తున్నారాయన. పురాతన నాణేలను,కరెన్సీని సేకరించాలని పట్టుదలతో ముందడుగు వేస్తున్నారు. ఈక్రమంలోనే కోట మండలం చిట్టేడు గ్రామానికి ఇటీవల వచ్చారు కణన్ షణ్ముగం. తన విశేషాభిరుచి గురించి ఆయన ఆంధ్రజ్యోతితో పంచుకున్నారిలా.. మాది చిత్తూరు. మానాన్న తమిళనాడులోని రాయవేలూరులో స్థిరపడ్డారు. నేను 1973-74ప్రాంతంలో ఇండియా తరపున ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా వ్యవహరించాను. పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. భార్య చెన్నైలో ఉంది. నాకు పురాతన నాణేలు,వివిధ దేశాల కరెన్సీ సేకరించడమంటే ప్రాణం. ఈక్రమంలోనే 50 ఏళ్లుగా చాలా దేశాల్లో తిరిగాను. ఆయా దేశాలకు సంబంధించి 700 నుంచి 800 ఏళ్ల నాటి కరెన్సీ నోట్లు, నాణెలను సేకరించాను. అమూల్యమైన నాణేలను ఇప్పటికీ చెక్కు చెదరకుండా భద్రపరిచాను. నాదగ్గరున్న యూకే నాణేలు చాలా ఖరీదైనవి. పురాతన కరెన్సీ, నాణేలను ఆయా దేశాల మ్యూజియంలకు అప్పగించాలనేది నా సంకల్పం. మూడు నెలలుగా చిట్టేడు విద్యానగర్‌లోని స్నేహితుడి ఇంటి వద్ద ఉంటున్నాను. పురాతన నాణేల సేకరణలో భాగంగా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో తిరుగుతున్నాను. ఈగ్రామ ప్రజలకు పురాతన నాణేలు,కరెన్సీ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు షణ్ముగం వివరించారు.

తిరుమలలో మళ్లీ తట్టల జోరు

● కొత్తగా 20 తట్టలకు అనుమతి?

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా తిరుమల కొండమీద కొందరి దందా మాత్రం యధాతథంగానే కొనసాగుతోంది. తిరుమలలో అనధికార తట్టలు(చిన్నపాటి అంగళ్లు) నిదానంగా విస్తరిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కావలసినవారికి, కోరుకున్న చోట ఇష్టానుసారం తట్టలకు అనుమతులు ఇచ్చేశారు. కోట్లరూపాయలు చేతులు మారినట్లు దీని మీద అనేక ఆరోపణలు కూడా వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీటీడీ ప్రక్షాళనలో భాగంగా అనధికార తట్టలకు అవకాశం ఉండబోదని అనుకున్నారు. అలాగే అనుమతి ఆధారంగా ఇష్టమొచ్చిన వ్యాపారాలు చేసుకోవడానికి కూడా వీలుండదని భావించారు. కొద్ది రోజులు పరిస్థితి మారినట్లు కనిపించింది. విజిలెన్స్ విభాగం ఈ అంశంపై విచారించి తట్టలకు అనుమతుల జారీలోనూ, స్థల మార్పిడిలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకున్నట్లు ఒక నివేదిక కూడా ఇచ్చింది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో తట్టలు కూడా తొలగించడంతో ఇక పద్ధతి ప్రకారమే అంతా జరుగుతుందని అనుకున్నారు. అయితే మళ్లీ అంతా మొదటికొచ్చింది. అనధికార తట్టల వ్యాపారాల జోరు పెరిగింది. తాజాగా, వరాహస్వామి, పాత అన్నప్రసాద కేంద్రం ప్రాంతాల్లో దాదాపు 20 తట్టలు ఏర్పాటు చేసుకునేందుకు రెవెన్యూ విభాగం అనుమతులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వీరికి అనుమతి ఎవరిచ్చారు, ఎందుకు ఇచ్చారు అంటూ ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. తట్టల వ్యాపారం అదుపు తప్పితే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంది.

ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం రవాణా కేసులో నిందితునికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ ఫారెస్ట్ బీటు అధికారి ఖ్యాతి తెలిపిన వివరాల మేరకు ఎర్రావారిపాళెంకు చెందిన ఎస్.బాలసుబ్రహ్మణ్యం 2016లో తలకోన సెంట్రల్ బీట్ నుంచి ఐదు ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. ఈకేసు తొమ్మిదేళ్లుగా దర్యాప్తు దశలో ఉంది. తాజాగా ఏపీపీ బాలకృష్ణ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ ప్రదీప్‌చంద్, డీఆర్వో బాబుప్రసాద్‌లు న్యాయమూర్తి ఎదుట సాక్షాధారాలను నిరూపించారు. దీంతో మంగళవారం నిందితునికి ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

పాల ట్యాంకర్‌ను ఢీ కొన్న కారు



రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల దుర్మరణం

● పాల ట్యాంకర్‌ను ఢీ కొన్న కారు ● మరో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పద్మ - చికిత్స పొందుతూ మృతి చెందిన జశ్వంతీసాయి - గాయపడిన హేమలత

చంద్రగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): తొండవాడ జాతీయ రహదారిలో పాల ట్యాంకర్‌ను కారు ఢీకొన్న దుర్ఘటలో తల్లి కొడుకు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు విజయవాడకు చెందిన కోటేశ్వరరావు, భార్య పద్మ(40), కుమారుడు జశ్వంత్‌సాయి(14), సోదరి హేమలతలు కారులో తిరుణామలైకు వెళ్లారు. ఈక్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం కాణిపాకం వినాయకస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కారు కోటేశ్వరరావు నడుపుతున్నారు. పక్క సీటులో కుమారుడు జశ్వంత్ సాయి, వెనుక సీటులో పద్మ, హేమలతలు కూర్చొన్నారు. తొండవాడ సమీపంలోని పూతలట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ను వీరి కారు వేగంగా వెళ్తూ ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారు వేగంగా ఢీకొనడంతో బెలూన్‌లు కూడా ఓపెనయ్యాయి. పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. జశ్వంత్ సాయి, హేమలతలకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన జశ్వంత్ సాయి, హేమలతలను స్థానికులు బయటకు తీశారు. వెంటనే అంబులెన్స్‌లో వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జశ్వంత్ సాయి మృతి చెందాడు. పద్మ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కోటేశ్వరరావు కోలుకుంటున్నారు. ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్ బాషా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు నెలలుగా ఏం చేశావ్?

● రైతులను ఆదుకోవాలంటే మీ నేతల ఫ్యాక్టరీల్లో రూ.12కి కొనిపించండి
● జగన్‌కు రైతు సంఘం నాయకుల సలహా

తిరుపతి(ఆటోనగర్), జూలై 8 (ఆంధ్రజ్యోతి): 'రెండు నెలలుగా ఏం చేశావ్. ఇప్పుడు పంట వడిగి పోతున్న సమయంలో బంగారుపాళ్యం వచ్చి రైతులను రెచ్చగొట్టేలా మాట్లాడటం వల్ల ఒరిగేది ఏమీ లేదు. రైతులను ఆదుకోవాలనుకుంటే.. జిల్లాలో మీ నేతలకే ఎక్కువ గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఇప్పటినుంచైనా వారిచేత రూ.12కు కొనిచ్చేలా ప్రకటన చేయండి' అంటూ టీడీపీ రైతు సంఘం నాయకులు సూచించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం పి.నాగేశ్వర్ రాజు, శివకోటేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.ఈ ఏడాది అంచనాల కంటే లక్ష టన్నులు అదనంగా పంట వచ్చిందన్నారు. దీనిని గ్రహించే తాము మార్చి నుంచే మామిడి రైతులతో పలుదఫాలు చర్చలు జరిపి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.ప్రభుత్వం స్పందించి టన్నుకు రూ.నాలుగు వేలు చెల్లించడానికి అంగీకరించిందన్నారు. అధికారులతో, గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో పదే పదే చర్చలు జరిపి మామిడి పంటను పూర్తిగా కొనేలా ఆదేశాలిచ్చారన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా వున్న మీరు రైతులకు చేసిన మేలు ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ రైతులను ఆదుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కె.గోపీనాథ్ రెడ్డి, టి.ప్రకాష్ నాయుడు, పి.చిన్నారెడ్డి, కె.సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రైతు సంఘ నాయకులు



నల్లపరెడ్డిపై చర్యలేవీ జగన్?

● టీడీపీ నేతల నిరసన

తిరుపతి, జూలై8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన నీచ వ్యాఖ్యలపై జగన్‌రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమంటే మహిళలను అవమానించడమేనని టీడీపీ నేతలు మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం తిరుపతిలో నిరసన తెలిపారు. జగన్ రెడ్డి అండతోనే వైసీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ విమర్శించారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రసన్నకుమార్‌రెడ్డి దిగజారుడు మాటలపై మహిళాలోకం ఆగ్రహంతో ఉందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, పాటకం వెంకటేష్, రామ్మూర్తి రాయల్, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర, అనిత తదితరులు పాల్గొన్నారు.

గదులు కేటాయించే ఎంబీసీ వద్ద భక్తుల మధ్య ఘర్షణ

● విజయవాడ భక్తుడిపై రాళ్లు విసిరిన ఇంటర్ విద్యార్థి

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గదులు కేటాయించే ఎంబీసీ34 వద్ద ఇద్దరు భక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో సహనం కోల్పోయిన ఓ ఇంటర్ విద్యార్థి రాళ్లు విసరడంతో విజయవాడకు చెందిన ఓ భక్తుడు గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన మోహన్‌కృష్ణ ఇంటర్ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చాడు. గది పొందేందుకు ఎంబీసీ34 కౌంటర్ వద్దకు వెళ్లారు. విజయవాడకు చెందిన రవిప్రసాద్ కూడా గది తీసుకునేందుకు ఎంబీసీ34కు చేరుకున్నాడు. క్యూలైన్‌లో రాకుండా రాంగ్‌రూట్‌లో వచ్చేడనే కారణంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటలు పెరిగి బూతులు తిట్టుకునే వరకు చేరుకోవడంతో సహనం కోల్పోయిన మోహన్‌కృష్ణ పక్కనే ఉన్న చిన్నపాటి రాళ్లతో రవిప్రసాద్‌పై విసిరాడు. దీంతో రవిప్రసాద్ ఛాతీపై చిన్నగాయమైంది. దీంతో అక్కడి ఉద్యోగులు పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకునేలోగా మోహన్‌కృష్ణ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అతడి స్నేహితుల ద్వారా పోలీసులు మోహన్‌కృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఘర్షణలకు పాల్పడితే ఆధార్ బ్లాక్ చేస్తాం

సిఫార్సు లేఖలు కలిగిన భక్తులు తోటి భక్తులను ఇబ్బంది పెడుతూ త్వరితగతిన గదులు పొందాలని ప్రయత్నించినా.. ఘర్షణకు పాల్పడినా వారి ఆధార్ కార్డులను బ్లాక్ చేస్తామని టీటీడీ హెచ్చరించింది. ఎంబీసీ34 గదుల కేటాయింపు వద్ద భక్తుల మధ్య ఘర్షణ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఈ ప్రకటన చేసింది. 'భక్తుల రద్దీ సాధారణంగాఉంది. గదులు అందుబాటులోనే ఉన్నాయి. అయినా సిఫార్సు లేఖలు కలిగిన భక్తులు సహనాన్ని కోల్పోయి ఘర్షణ వాతావరణం సృష్టించడం బాధాకరం. హిందూ ధార్మిక క్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత' అని ఆ ప్రకటనలో పేర్కొంది.


ప్రతి జిల్లా అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోండి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), జూలై 8(ఆంధ్రజ్యోతి): పి4లో భాగంగా ప్రతి జిల్లా అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం వివిధ శాఖ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ శనివారం లోపు ప్రతి రెవెన్యూ డివిజన్‌లో కనీసం 20మందికి తక్కువ కాకుండా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. తానూ కలెక్టరేట్ సమీపంలోని నక్కల కాలనీలో మూడు కుటుంబాలను గుర్తించామన్నారు. ఇక అన్నదాత సుఖీభవ పథకం కింద 17వ తేదీన నగదు విడుదల చేయాలన్నారు. 1 నుంచి ఇంటర్ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు కలిసి ఈ నెల 10 జరిగే మెగా పేరంట్స్ , టీచర్స్ మీటింగ్2.0ను పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్‌లో సమస్యలకు గడువులోపు పరిష్కారం చూపకుంటే అందుకు వివరణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



తిరుపతి(ఆటోనగర్), జూలై8(ఆంధ్రజ్యోతి): పదేళ్ళుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై జాతీయ స్థాయిలో బుధవారం కార్మిక సంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు నిరసనలు తెలియ జేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధించి పాలకులకు కనువిప్పు కలిగేలా ఆందోళనలు చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తూ, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు ఎ.రామానాయుడు,శివరెడ్డి, పి.మురళి, సి.పెంచలయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యమా.. సహకారమా?

● ఒకరి బీమా సొమ్ము మరొకరి ఖాతాకు జమలో అధికారుల పాత్ర ఎంత?

పెళ్లకూరు/నాయుడుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో బీమా తీసుకుంది ఆరూరు వెంకటసుబ్బయ్య కుమారుడు వెంకటేశ్వర్లు. మెచ్యూర్ సొమ్ము జమైంది ఆరూరు సిద్దయ్య కుమారుడు వెంకటేశ్వర్లు బ్యాంకు అకౌంట్‌కు. వీరిద్దరికీ పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామమే. బంధువులే. ఇలా ఎల్ఐసీకి తప్పుడు బ్యాంకు ఖాతా వివరాలిచ్చి రూ.19.87 లక్షలు కాజేసిన ఘటనలో అధికారులది సహకారమా.. నిర్లక్ష్యమా అనేది తేలాల్సి ఉంది. బాధితుడికి వడ్డీసహా డబ్బులిస్తామని చెబుతున్న అధికారులు బాధ్యులపై ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాలిలా ఉన్నాయి. పెళ్లకూరు మండలం జీలపాటూరుకు చెందిన ఆరూరు వెంకటసుబ్బయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు పాలసీ మెచ్యూర్ సమయం ముగిసింది. ఈ రూ.19,87,500 లక్షలు రావాలి. మే నెల 9న తన బ్యాంకు ఖాతాలు, ఆధార్, పాన్ తదితరు ధ్రువీకరణ పత్రాలను నాయుడుపేట ఎల్ఐసీ కార్యాలయంలో సమర్పించారు. జూన్ 27న ఆయన బ్యాంకు ఖాతాకు నగదు జమవుందని తెలిపారు. అయితే, జూలై ఒకటి వరకూ నగదు జమ కాకపోవడంతో ఆరూరు వెంకటేశ్వర్లు ఎల్ఐసీ కార్యాలయానికి వెళ్లి వాకబు చేశారు. తనకు జమ కావాల్సిన నగదు జూన్ ఆరో తేదీన తమ సమీప బంధువైన ఆరూరు సిద్దయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు ఖాతాకు జమ చేసినట్లు తెలిసి కంగుతిన్నాడు. రెండు నెలలు కిందటే అన్ని వివరాలు ఇచ్చినా వేరే వారి ఖాతాకు ఎలా నగదు బదిలీ అయిందని నిలదీయగా, ఎక్కడ ఏం జరిగిందో తెలుసుకుని న్యాయం చేస్తామని నచ్చజెప్పినట్లు తెలిసింది. ఎల్ఐసీ అధికారుల విచారణలో సిద్దయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు పేరిట నాయుడుపేటలోని బ్యాంకు ఖాతాలో జమయినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఎల్ఐసీలోని కొంతమంది సిబ్బంది ద్వారా తన తండ్రి ఆరూరు వెంకటేశ్వర్లు (తండ్రి సిద్దయ్య) ఆధార్, పాన్, మొబైల్ నెంబర్ల వివరాలను ఆరూరు జ్ఞానేంద్ర ఇచ్చి.. ఆరూరు వెంకటేశ్వర్లు (తండ్రి వెంకటసుబ్బయ్య) ఎల్ఐసీ ఖాతాకు లింకు చేసినట్లు సమాచారం. తన తండ్రి ఖాతాలో జమయిన నగదును తన ఖాతాలోకి మార్చుకుని అనంతరం రూ.10 లక్షలు తన భార్య, రూ.9 లక్షలు తన అత్త పేరుమీద అతడు చాకచక్యంగా మార్చుకున్నట్లు తెలిసింది. నాయుడుపేట ఎల్ఐసీ అధికారులు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యాలయానికి వివరాలను తెలియజేశారు. ఇలా ఎల్ఐసీ అధికారులను బురిడీ కొట్టించిన వ్యక్తిని.. అతడికి సహకరించిన ఎల్ఐసీ సిబ్బంది పైనా ఇంతవరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని బాధితుడు వాపోయారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించి భవిష్యత్తులో మరొకరికి ఇలాంటి అన్యాయం జరగకుండా చూడాలని కోరుతున్నారు. కాగా, ఇందులోని బాధ్యులు.. బాధితుడి బ్యాంకు ఖాతాలో నగదు జమచేయించేలా చర్యలు చేపట్టినట్లు తెలిసింది. మరి, బాధ్యులపై ఎలాంటి చర్యలుంటాయో చూడాలి.

మూడు మార్గాల్లో 48 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో వుంచుకొని దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-హిస్సార్‌ల మధ్య నడుస్తున్న వారాంతపు రైళ్లను సెప్టెంబరు వరకు పొడిగించింది. అలాగే కాచిగూడ-తిరుపతిల మధ్య 8 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు. తిరువణ్ణామలైలో కొండ చుట్టూ తిగడానికి భక్తుల రద్దీ పెరగడంతో, నరసాపూర్ -తిరువణ్ణామలైల మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

తిరుపతి-హిస్సార్‌ల మధ్య 24 వారాంతపు రైళ్లు

● తిరుపతి-హిస్సార్ మధ్య వారాంతపు రైళ్లను బుధవారం నుంచి సెప్టెంబరు 28 వరకు పొడిగించారు.తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07717) ప్రతి బుధవారం బయలుదేరి రెండవ రోజుకు హిస్సార్ చేరుకొంటుంది.హిస్సార్‌లో ఈ ప్రత్యేక రైలు (07718)ప్రతి ఆదివారం బయలుదేరి వచ్చిన మార్గంలోనే తిరుపతికి చేరుకుంటుంది.

కాచిగూడ -తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

● కాచిగూడలో ఈ నెల 10,17,24,31,తేదీల్లో ప్రతి గురువారం ఈ ప్రత్యేక రైలు(07653) బయలు దేరి మల్కాజ్‌గిరి, జనగాం, గూడూరు మీదుగా తిరుపతికి మరుసటి రోజుకు చేరుకొంటుంది. తిరుపతిలో ఈ నెల 11, 18, 26, ఆగస్టు1వ తేదీల్లో ఈ రైలు(07654) బయలుదేరుతుంది.

నరసాపూర్-తిరువణ్ణామలై మధ్య 16 ప్రత్యేక రైళ్లు

● నరసాపూర్‌లో ఈ నెల 9, 16, 23, ఆగస్టు6, 13, 20, సెప్టెంబరు 3, 24 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు (07219) బయలుదేరి విజయవాడ, తెనాలి, తిరుపతి, చిత్తూరు, వేలూరు మీదుగా మరుసటి రోజు తిరువణ్ణామలైకి చేరుకొంటుంది. తిరువణ్ణామలైలో ఈ నెల 10, 17, 24, ఆగస్టు 7, 14, 21, సెప్టెంబరు 4, 25 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు(07220) బయలుదేరి మరుసటి రోజు నరసాపూర్‌కు చేరుకుంటుంది.

ఘనంగా రొట్టెల పండుగ



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముతవల్లి

చిల్లకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక దోషా షహీద్ దర్గా వద్ద మంగళవారం రొట్టెల పండుగ ఘనంగా నిర్వహించారు. నెల్లూరు తరువాత చిల్లకూరు దర్గాలో రొట్టెల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. నెల్లూరు దర్గాలో పాల్గొన్న భక్తులు ఇక్కడి దర్గా వద్ద వచ్చి రొట్టెలను మార్చుకుని దర్గాలోని సయ్యద్ అహమ్మద్‌షా, సయ్యద్ మొహమ్మద్‌షా సమాధులను దర్శించుకుని ప్రార్థనలు జరిపారు. ముత్తవలి జుబేర్‌బాషా భక్తుల తలపై నెమలి పింఛం ఉంచి ప్రార్థనలు చేశారు.

ప్రజలను ఇబ్బంది పెడితే లోపలేయిస్తా

కౌన్సిలర్ తీరుపై ఎమ్మెల్యే కురుగొండ్ల ఆగ్రహం



4వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జులై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బంది పెడితే లోపలేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని 4వ వార్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. వైసీపీకి చెందిన స్థానిక కౌన్సిలర్ ఇంట్లోని మురుగునీటిని గుంతతీసి తమ ఇంటి వైపు మళ్లించాడని ఓ మహిళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది. ఆ కౌన్సిలర్‌పై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చాయని స్థానిక టీడీపీ నేతలు చెప్పడంతో ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. వెంటనే మున్సిపల్ కమిషనర్‌ను పిలిచి కౌన్సిలర్‌కు ఒకసారి చెప్పి చూడండి... వినకపోతే పోలీసు కేసు పెట్టండని ఆదేశించారు. అనంతరం వార్డులో ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, గంగాధరం, పునుగోటి విశ్వనాథ నాయుడు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, మంకు ఆనంద్, గల్లా శ్రీనివాసులు, దొంతు మునేయ్య, బొలిగల వెంకటసుబ్బయ్య, పచ్చూరి నరసయ్య నాయుడు, గడ్డం మురళి, రామకృష్ణ, నరిసింహులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



నవధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, ఏడీపీఎం పట్టాభిరెడ్డి

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ పట్టాభిరెడ్డి అన్నారు. కోటలోని 1వ సచివాలయ ప్రాంగణంలో మంగళవారం ఏటీఎం సాగు, సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాలతో పాటు జనుము, జొన్న, పిల్లిపెసర, సజ్జ, మొక్కజొన్న, ఉలవ, కంది, ఆముద, ఆవాలు సాగు చేయాలని సూచించారు. సేంద్రియ ఎరువులతో సాగు చేయడం వల్ల భూమి సారవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో నీలిమ, మోడల్ మేకర్ శ్రీనివాసులు, భాగ్యమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

సూళ్లూరుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ అన్నారు. మంగళవారం సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. శారీరక ద్రవ్యరాశి కొలతలు తీశారు. ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

వెంకటగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని నారాయణ స్కూల్ ఏజీఎం రియాజ్ అన్నారు. మంగళవారం పర్యావరణ పరిరక్షణపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి విద్యార్థీ తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

వెంకటగిరి, జూలై 8: తమ సమస్యల సాధన కోసం మున్సిపల్ కార్మికులు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేసేవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెంచలయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత

వాకాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన రెడ్డిమునెయ్య ఇటీవల పిడుగుపాటుకు మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు రూ.4లక్షల చెక్కును ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, టీడీపీ నాయకులు దశరథరామిరెడ్డి, దువ్వూరు జనార్ధనరెడ్డి, పంత్రాంగం అరుణ్, రౌతు రమణయ్య, గుండాల శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను తరిమికొడతాం

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి అవగాహనతో మాదక ద్రవ్యాలను తరిమికొట్టాలని ఎస్‌ఐ పవన్‌కుమార్ కోరారు. కోటలోని అంబేడ్కర్ గురుకులంలో మంగళవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలను దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ పవన్‌కుమార్

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

గంజాయి కేసులో మరో ఇద్దరి అరెస్టు

సూళ్లూరుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెల 27న సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారుపోలూరు వద్ద పోలీసులు 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇదే కేసులో పరారీలో ఉన్న సూళ్లూరుపేట పట్టణం బొగ్గుల కాలనీకి చెందిన అజిత్ కుమార్, తడ మండలం కారూరుకు చెందిన రాకేష్‌ను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలోని కొండమిట్ట ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలలో రికార్డులను, విద్యార్థులకు వండి పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు.

నేటి సమ్మెను విజయవంతం చేయాలి

గూడూరు అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు.



వైద్యం కోసం వేచివున్న రోగులు - చికిత్స అందిస్తున్న నర్సు -మూసివున్న వైద్యుల గది

అక్కడ నర్సులే వైద్యులు

తడ పీహెచ్‌సీలో రోగులకు అందని వైద్యం

తడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తడ పీహెచ్‌సీలో రోగులకు వైద్యం అంతంత మాత్రంగానే అందుతోంది. పట్టణాలకు దీటుగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తడలో స్థానికులతో పెద్దసంఖ్యలో పాటు కార్మికులు, ఉద్యోగులు నివాసముంటున్నారు. వీరందరికీ తడ పీహెచ్‌సీనే దిక్కు. జాతీయ రహదారికి ఆనుకుని సుమారు ఎకరా స్థలంలో నిఫో పరిశ్రమ వ్యవస్థాపకుడు పొట్టిపాటి ఓబుళరెడ్డి 1990లో కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని నిర్మించి ప్రభుత్వానికి అందజేశారు. అప్పట్లో వైద్యసేవలు బాగానే అందేవి. రానురాను ఆస్పత్రికి సుస్తీ చేసింది. ప్రస్తుతం తడ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ఒక ఫార్మాసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, నర్సులు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నట్లు అధికారిక సమాచారం. వాస్తవంగా ఇక్కడ పనిచేస్తున్న మహిళా వైద్యురాలు దీర్ఘకాలిక ప్రసూతి సెలవులో ఉండగా, మరో వైద్యుడు గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించే 104 క్యాంపులకు వెస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండడంలేదు. ఒక రోజుకు 80 నుంచి 100 మంది వరకు రోగులు వస్తున్నా వారందరికీ నర్సులే వైద్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలానికి ఆనుకునే సుమారు 30 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉండడంతో తరచూ ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే క్షత గాత్రులకు ఇక్కడ వైద్యం అందే పరిస్థితి లేదు. వచ్చిన రోగులు నర్సులే మందు బిళ్లలు ఇచ్చి పంపుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తడ పీహెచ్‌సీ మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హామీలను నేరవేరుస్తున్న ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదే: పాశం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తున్న ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని రామలింగాపురం, సంతదాసుపల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటా ప్రజలను మోసం చేసిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రూ. 4వేలకు పెంచి ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందజేయడం జరిగిందన్నారు. అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి రూ.5కే నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ పేదల ఆకలిని తీరుస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నారన్నారు. సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. అనంతరం రామలింగాపురం గ్రామంలో రూ.6లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.9లక్షలతో నిర్మించి పాఠశాల ప్రహరీని ప్రారంభించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, కృష్ణారెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, అమరేంద్ర, జహంగీర్, మధురెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య వృత్తికి న్యాయం చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి బాలకృష్ణ నాయక్

డక్కిలి, జులై 8 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తే రోగులకు అందిస్తున్న సేవలు ఎలా ఉన్నాయో అర్థం అవుతోంది.. ప్రభుత్వం నుంచి జీతం తీసుకొంటున్నందుకైనా వైద్య వృత్తికి న్యాయం చేయాలని జిల్లా వైద్యాధికారి బాలకృష్ణ నాయక్ వైద్యులను హెచ్చరించారు. మంగళవారం ఆయన డక్కిలి ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఓపీ నమోదు గందరగోళంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య, కుటుంబనియంత్రణ ఆపరేషన్ల సంఖ్య పెంచాలని ఆదేశించారు. అలాగే టీబీ ముక్త్ భారత్, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు, డయేరియా నియంత్రణపై సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో హరిత, వైద్యాధికారి హరి తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరా మెరుగుకు చర్యలు

చిల్లకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కడివేడు గ్రామంలో రూ.16.32 కోట్లతో ఏర్పాటు చేయనున్న 33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో సక్రమంగా విద్యుత్ సరఫరాను అందజేయకపోవడంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం మారుమూల గ్రామాలకు సైతం నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయానికి ఎటువంటి కోతలు లేకుండా 9 గంటల పాటు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, భాస్కర్‌రెడ్డి, గుండాల లీలావతి, తహసీల్దారు శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాలి

సూళ్లూరుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ద్విచక్ర వాహనదారులు, వ్యాపార దుకాణాలు తప్పకుండా నిబంధనలు పాటించాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం సీఐతో పాటు సూళ్లూరుపేట, శ్రీహరికోట ఎస్‌ఐలు బ్రహ్మనాయుడు, శ్రీకాంత్ తమ సిబ్బందితో కలిసి పట్టణంలోని బజారు ప్రధాన వీధుల్లో వ్యాపారస్తులు, పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు తమ దుకాణాల పరిధి దాటి రోడ్లపై వస్తువులు పెట్టడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. తోపుడు బండ్లను రోడ్డులో పెట్టుకుని విక్రయాలు సాగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వ్యాపారస్తులు, ద్విచక్ర వాహనదారులు సహకరించాలన్నారు.

సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం: విజయశ్రీ

పెళ్లకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, కానూరు, శిరసనంబేడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆమె భర్త పార్థసారధి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ కరపత్రాలను అందజేశారు. ముందుగా తాళ్వాయిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, గూడూరు ప్రభావతమ్మ, నాయకులు వేలూరు కల్యాణ్‌రెడ్డి, దామెర ప్రసాద్‌నాయుడు, పేరం రమేష్ నాయుడు, పాపాడి రాజగోపాల్‌రెడ్డి, కందమూడి శివకుమార్, శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, గూడూరు సుధీర్‌రెడ్డి, వెంపళ్ల వెంకటేశ్వర్లు, గాలి రమేష్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, కాటంరెడ్డి మల్లిఖార్జున రెడ్డి, పునబాక పోలయ్య, యాగాన్ని బెన్ని, కిలారి గోపి, గంగాబత్తిన రామకృష్ణ, దొమ్మరాజు సత్యనారాయణరాజు, వెంటయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం



జెమిన్‌కొత్తపాళెం గ్రామంలో మొక్కలను నాటుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు, బీజేపీ కన్వీనర్ పురుషోత్తమరెడ్డి

వాకాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి అన్నారు. మండలంలోని జెమిన్‌కొత్తపాళెం గ్రామంలో రైతులకు చెందిన నాలుగు ఎకరాల్లో మామిడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

వాకాడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0 ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థిరమైన అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ట్రైనర్లు మల్లికార్జున, సునీల్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు, ఎంఈవో నసీంఆలీ, సీడీపీవో మునికుమారి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడివయ్య కాలనీలోని గాడ్‌గ్రేస్ అనాథ శరణాలయంలో మంగళవారం అబ్దుల్ గఫూర్ దాతృత్వంతో బాస్ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కూరపాటి రవీంద్రబాబు, జాన్‌పాల్ తదిత రులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్ మృతి తీరనిలోటు



చంద్రశేఖర్ (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేవాంగ సంక్షేమ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు కన్నా చంద్రశేఖర్ మృతి తీరనిలోటని ఆ సంఘం అధ్యక్షుడు మన్నెం సతీష్ అన్నారు. చంద్రశేఖర్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. దేవాంగ సంక్షేమ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు సజ్జా వెంకట సురేష్, కోశాధికారి మాధవరావు, మాదన ఉదయ్‌భాస్కర్, కొండా శేఖర్ తదితరులు మంగళవారం చంద్రశేఖర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కూడా చంద్రశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు.

కమణీయం సీతారాముల కల్యాణం



స్వామి, అమ్మవార్లకు కల్యాణం చేస్తున్న వేదపండితులు

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం తెల్లవారుజామున సీతారాముల శాంతి కల్యాణ మహోత్సవం జరిగింది. వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని పట్టాభిరామ ఆలయం నడుపుతున్న సీతారామ ధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ సౌజన్యంతో సీతారాముల కల్యాణం జరిగింది. జిల్లా అర్చక సలహామండలి సభ్యుడు దీవి అనంతాచార్యులు స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ ఉత్తమ్ హోటల్ అధినేత కొడవలూరు ధనంజయరెడ్డి, నరేష్‌శర్మ, సాయి బాబా, సురేష్, సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



గూడూరు, వెంకటగిరిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి - నాయుడుపేటలో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఘనంగా వైఎస్సార్ జయంతి

గూడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని వైసీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్‌నగర్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ నివాళులర్పించారు. చేవూరు విజయ్ మోహన్‌రెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, మగ్దూం, సుబ్బారావు, మధురెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. నివాళులర్పించి, కేక్ కట్‌చేశారు. వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సహకార సంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, చదలవాడ కుమార్, పాలేటి నాగార్జున, సిద్ధయ్య, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోండి



తిమ్మాజికండ్రిగలో పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

నాయుడుపేట టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. మండలంలోని తిమ్మాజికండ్రిగ, యర్రప్పశెట్టిపాళెం గ్రామాల్లో పంటలను మంగళవారం ఏవో గణేష్‌తో కలసి పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి అన్నదాత సుఖీభవ పథకంలో పేర్లు లేని రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యా కమిటీ చైర్మన్‌గా విజయ భాస్కర్

చిట్టమూరు, జులై 8(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు జీఎం నాయుడు ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చెర్మన్‌గా మల్లి విజయ భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉన్న చైర్మన్ బద్దిగ నారాయణ మృతి చెందడంతో మంగళవారం నూతన చైర్మన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరావు, తిరుపతి పార్లమెంటు టీడీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి బషీర్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గువ్వల సురేష్ పాల్గొన్నారు.

అవాజ్ కమిటీ ఎంపిక

నాయుడుపేట టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్య భవనంలో నూతన అవాజ్ కమిటీని ఎంపిక చేసినట్లు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రషీద్ తెలిపారు. మంగళవారం అవాజ్ మైనారిటీ డెవలప్‌మెంట్ ఫోరం జనరల్ బాడీ సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా హలీమ్‌ఖాన్, కార్యదర్శిగా ఖాదర్, ఉపాధ్యక్షులు షేక్ అన్సర్, షేక్ ఉస్మాన్, సహాయ కార్యదర్శులు షేక్ కాలేషా, షేక్ అబ్దుల్లా, ట్రెజరర్‌గా రియాజ్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

మద్దాలిలో పొలం పిలుస్తోంది

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దాలి, కేశవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రైతులు పురుగు మందుల యాజమాన్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అవసరం మేరకే ఎరువులు పంటలకు వాడాలని సూచించారు. అదే విధంగా ప్రధాన మంత్రి కిసాన్, అన్నదాత సుఖీభవ, ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం జరిగితే వర్తించే బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, సాయి మహేష్ పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

చిల్లకూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామానికి చెందిన రేణుక అనే బాలిక కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమె వైద్యఖర్చుల కోసం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15వేలు మంగళవారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు ప్రజేంద్రరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే చంద్రన్న ధ్యేయం



20వ వార్డులో కరపత్రాల పంపిణీ

శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 20, 29 వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు వివరించారు. కంఠా రమేష్, గోపినాథ్, రమేష్‌బాబు, మీర్జా, సునీతమ్మ, పోలూరు శ్రీనివాసులరెడ్డి, రవీంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి ఆధ్వర్యంలో తొలిఅడుగు జరిగింది.

● శ్రీకాళహస్తి మండలంలోని గంగలపూడి, ఎర్రమరెడ్డిపల్లె, పాతకుంటల్లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, పాపిరెడ్డి, కామేష్‌యాదవ్, రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

● తొట్టంబేడు మండలంలోని బోనుపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజా నాయుడు, జయచంద్రనాయుడు, బాలాజీరెడ్డి, మురళినాయుడు తదితరులు పాల్గొన్నారు.

● రేణిగుంట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాంచాలి నగర్‌లో 156, 157 బూత్ కన్వీనర్లు శివయ్యనాయుడు, కిరణ్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరారు. త్వరలో జ్యోతి నగర్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మునిచంద్రారెడ్డి, మెహబూబ్ బాషా, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, పుష్పనాథన్, కన్నన్ రెడ్డి, మేరీ, డి.రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యసేవలు



ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వైద్యపరీక్షలు చేయించుకుంటున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ హాస్పిటళ్లకు దీటుగా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలను మెరుగుపరుస్తున్నారని ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మంగళవారం ఆమె పలు వైద్య పరీక్షలను స్వయంగా చేయించుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, కంటి వైద్యనిపుణులు మణి ఆమెకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిషితారెడ్డి మాట్లాడుతూ... గత వైసీపీ పాలనలో ఆస్పత్రిలో వైద్యసేవలు నీరుగారిపోవడం వల్ల ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పోయిందన్నారు. ఏరియా ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖరీదైన వైద్యాన్ని చేరువ చేయాలన్న సంకల్పం, ప్రభుత్వ ఆస్పత్రిపై నమ్మకం కలగాలన్న ఉద్దేశంతోనే తాను ఇక్కడ వైద్య పరీక్షలు చేయించుకున్నానని చెప్పారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆహ్వానం

శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ 2.0 జూలై 10న శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు ఊరందూరులోని ఎమ్మెల్యే సుధీర్ స్వగృహానికి చేరుకుని ఆయన సతీమణి రిషితారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. గ్రామంలోని విద్యావేత్తలను, తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

ఏర్పేడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు సూచించారు. మద్రాస్ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూమిలో కర్బన శాతం తగ్గిపోవడంతో చీడపీడలు పెరిగాయన్నారు. ఎరువులకు బదులు ఘన, ద్రవ జీవామృతాలను ప్రతి 18 రోజులకు ఒకసారి పొలంలో పారించుకోవాలని సూచించారు. ప్రతి రైతు తక్కువ విస్తీర్ణంలో అయినా సేంద్రియ పంటలు పండించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలనిచెప్పారు. ఏడీఏ రమేష్‌రెడ్డి, జిల్లా పథక మేనేజరు షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

నీచ సంస్కృతిని మానుకోని వైసీపీ



శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీ మాత్రం తన నీచ సంస్కృతిని మానుకోలేదని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు హేయమన్నారు. ఇలాగే ప్రవర్తిస్తే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, నాయకులు మిన్నలరవి, వజ్రం కిషోర్, మునిరాజాయాదవ్, భగత్, భాస్కర్ మురళీకృష్ణ, కృష్ణమూర్తి, మురళీనాయుడు, సులేమాన్, శివ, చంద్రమౌళి, సిరాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో రైతులకు లాభం

పిచ్చాటూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక ఉద్యానవన పంటల సాగుతో రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వస్తాయని ఎంపీడీవో మహ్మద్‌రఫి తెలిపారు. మంగళవారం పిచ్చాటూరు వ్యవసాయ పొలాల్లో రైతులతో కలసి ఉపాధి హామీ పనుల ద్వారా పండ్ల తోటల పెంపకం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉచితంగా పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ

సత్యవేడు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు కాపాడుకునేందుకు, లేబర్ కోడ్లు రద్దు చేసేందుకు దేశవ్యాప్తంగా 9న తేది జరగనున్న సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, ఉద్యోగులు, ప్రజాతంత్ర వాదులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మెలుగు రమేష్ ఒక ప్రకటనలో కోరారు.

విద్యాసామగ్రి వితరణ

శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం తంగేళ్ల పాళెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గుడ్లూరు కార్తీక్, కాంట్రీ సహకారంతో రూ.20వేల విలువైన విద్యాసామగ్రిని వితరణ చేశారు. సర్పంచ్ చెంచుకృష్ణమనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుడ్లూరు మోహన్‌నాయుడు, ఎంఈవో భారతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వినాయకస్వామి ఆలయం తెరిచేదెన్నడో?



శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజ్ఞానగిరి కుమారస్వామి ఆలయం దిగువన ఉన్న వినాయకస్వామి ఆలయం ఎపుడు తెరుస్తారో అని భక్తులు అంటున్నారు. గతంలో ఈ ఆలయం భక్తులకు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం పునర్నిర్మాణం తరువాత స్వామివారిని చెరసాలలో బంధించినట్లు గేట్లు పెట్టారు. దీంతో భక్తులు చేసేది లేక బయటి నుంచే కర్పూర హారతులు, మొక్కులు చెల్లించుకుని వెళ్తున్నారు.

పుత్తూరు వార్తలు

మాతమ్మ ఆలయ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కేబీఆర్‌పురంలో ఉన్న మాతమ్మ ఆలయ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువ తో సన్మానించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. బాలాజీ, మోహన్‌రాజు, వెంకటరమణ, మహేష్, నరసింహులు, హరీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కేబీఆర్‌పురంవాసులు సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాలు ఇచ్చారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

12న కంటి వైద్య శిబిరం

వరదయ్యపాళెం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్వీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 12వ తేదీ కంటి వైద్య ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యురాలు విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు జరిగే శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధర్మరాజస్వామి ఆలయంలో కుంభం



శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో కొలువై ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం కుంభం జరిగింది. ధ్వజావరోహణం తరువారి రోజు స్వామిఅమ్మవార్లకు కుంభం వేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంభం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముక్కంటి ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి: జడ్పీ సీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

రేణిగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది చేతుల్లో ఉందని ఉమ్మడి జిల్లా జడ్పీ సీఈవో రవికుమార్ చెప్పారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0పై జరిగిన ఒక రోజు శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు వైపు ప్రతి పంచాయతీని తీసుకెళ్లాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్రకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావు, ఏవో పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మండలాలకు తెలుగుగంగ నుంచి నీటి సరఫరాకు ఖర్చు చేసిన రికార్డులను జడ్పీ సీఈవో పరిశీలించారు. 2023- 24 సంవత్సరానికి మంజూరైన రూ.50 లక్షలకు సంబంధించి నీటి సరఫరా ఖర్చులను పరిశీలించారు. అనంతరం రేణిగుంట జనాభా ప్రకారం తెలుగుగంగ నీటిని ఎంత వినియోగిస్తున్నారని ఆరా తీశారు. ఎక్కువ మొత్తంలో వినియోగిస్తున్నట్లు తేలడంతో మీటరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీఆర్ ఏఈ రమణ, కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోగతి వివరాలను పారదర్శకంగా సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో త్రివిక్రమరావు కోరారు. సర్వే విధానంపై రిసోర్స్ పర్సన్ మణికంఠ వివరించారు. 2022-2023, 2023-2024 ఆర్థిక సంవత్సరాల్లో పంచాయతీల్లో జరిగిన పురోగతికి సంబంధించి 17 శాఖలు తమ వివరాలను తప్పనిసరిగా సేకరించాలన్నారు. దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి హర్షవర్ధన్, పీహెచ్‌ఈవో సుబ్రమణ్యం, కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వేపై శిక్షణలో ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కైలాసనాథ కోన ఆలయ అర్చకుడి శివైక్యం



సురేష్ (ఫైల్ ఫొటో)

నారాయణవనం, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరణ్యం కండ్రిగ పంచాయతీలోని కైలాసనాథ కోన ఆలయ అర్చకుడు సురేష్(45) అనారోగ్యంతో సోమవారం రాత్రి శివైక్యం చెందారు. కామాక్షి సమేత కైలాసనాథ స్వామి ఆలయంలో ఆయన సేవలందించారు. అయన శివైక్యం చెందడం పట్ల జిల్లాలోని బ్రాహ్మణ సంఘాలు సంతాపం వ్యక్తం చేశాయి. బ్రాహ్మణ సంఘ రాష్ట్ర యువజన అధ్యక్షుడు వేదం హరిప్రసాద్, జిల్లా అధికారి ప్రతినిధి కె.బాలాజీ శర్మ, పుత్తూరు గాయత్రీ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు ఆలూరు రామకృష్ణ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ఆదిమూలం



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే

నాగలాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. మండలంలోని కొట్టకాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతు పొలంలో పూల మొక్కలను నాటారు. ఉచితంగా గుంతలు తవ్వించి, మొక్కలు నాటించడంతో పాటు మూడేళ్ల వరకు పెంపక నిర్వహణ చేపడుతోందని వివరించారు.

ఇంటి స్థలాల కోసం ధర్నా



ధర్నా చేస్తున్న కనమనంబేడు దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు దళితులు ఇంటి స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఏరియా కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఇంటి స్థలాలకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా రొట్టెల పండుగ

శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దర్గామిట్టలో ఉన్న జంలేషాపీర్ దర్గాలో ఇమాం హుస్సేన్ పీర్ల జెండాకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రొట్టెల పండుగ ప్రారంభమైంది. చదువుల రొట్టె, ఆరోగ్య రొట్టె, ఉద్యోగ రొట్టె, సంతాన రొట్టెను కావాల్సిన వారు ఒకరికొకరు పంచుకున్నారు. అనంతరం దర్గా నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సౌభాగ్యం

ఏర్పేడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో సౌభాగ్యం చెప్పారు. ఏర్పేడు శ్రీశక్తి భవనంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ గీత హాజరు కాకపోవడంతో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బండారుపల్లిలో శ్మశాన వాటికకు దారి సౌకర్యం కల్పించాలని ఎంపీటీసీ సభ్యుడు జనార్దన రెడ్డి కోరారు. అదే విధంగా జంగాలపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని మరుగుదొడ్డికి నీటి సదుపాయం కల్పించాలని సర్పంచు నారాయణ కోరారు. అదే విధంగా రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని చెప్పుకోవడానికి సంబంధిత శాఖ ఏఈ గత మూడు మండల సర్వసభ్య సమావేశాలకు రాలేదని సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివయ్య మండిపడ్డారు. బండారుపల్లి, మేర్లపాక పంచాయతీల్లో ఆశా వర్కర్లను నియమించాలని కోరారు. తహసీల్దారు భార్గవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు. కాగా మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ గీత హాజరు కాలేదు. ఆమె ఏప్రిల్ 21న రాజీనామా పత్రాన్ని ఎంపీడీవోకు అందించగా దాన్ని జడ్పీ సీఈవోకు పంపిన విషయం విదితమే. ఈ క్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు యాదవ్‌ను 1954 ఆర్టికల్ ప్రకారం సీఈవో అనుమతితో సభ నిర్వహణకు ఎంపీపీగా నియమించారు. మంగళవారం ఒకరోజు మాత్రమే శ్రీనివాస యాదవ్‌ను ఎంపీపీగా నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.

ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు జుగుప్సాకరం

శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు జుగుప్సాకరమని ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ నేతలకు మహిళలంటే ఏ మాత్రం గౌరవం లేదన్నారు. వైసీపీ అధినేత జగన్‌కు కూడా తల్లి, చెల్లిపై ఏమాత్రం గౌరవం లేదన్నారు. గత వైసీపీ పాలనలో అసెంబ్లీలో నారా భువనేశ్వరిపై మంత్రులు, ఎమ్మెల్యేలు అవమానకర వ్యాఖ్యలు చేశారన్నారు. దీన్ని అప్పట్లో సీఎంగా ఉన్న జగన్ ఖండించలేదన్నారు. గత వైసీపీ పాలనలో మహిళలు ఎన్నోకష్టాలు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం, గౌరవం ఇస్తున్నారని ఆమె తెలిపారు. కాగా రేణిగుంటలో జరిగిన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న రిషితారెడ్డి అక్కడ కూడా నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డారు.

రుణ లావాదేవీలు సక్రమంగా నిర్వహించండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘ సభ్యులు రుణాలను సకాలంలో చెల్లించడమే కాకుండా లావాదేవీలను సక్రమంగా నిర్వహించాలని అడిషనల్ సీఈవో శ్రీరాములు చెప్పారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వీఓలు, సీసీలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... 2025 మార్చి 31 నాటికి సంఘంలో సభ్యుల వారీగా పొదుపుతో పాటుగా అంతర్గత అప్పులు, సీఐఎఫ్, బ్యాంకు రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి ఇతర రుణాల నిల్వలు కచ్చితంగా సేకరించాలన్నారు. ఇంకా పెండింగ్ ఉన్న వార్షిక రుణ ప్రణాళికలు కూడా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లతో మర్యాదగా నడుచుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీఎల్వోలు ఓటర్లతో మర్యాదగా నడుచుకోవాలని సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి బీఎల్వో తమ పరిధిలోని పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండి క్లెయిమ్‌లను తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని కొత్త ఓటరుగా నిరంతరం నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులు నిశితంగా పరిశీలించాలన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

నారాయణవనం, జూలై 8(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ దర్శిత్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం డెంగ్యూ నివారణ మాసోత్సవాల సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండే దోమలు ప్రబలుతాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీ ప్రణాళికలపై నివేదిక

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ ప్రణాళికలపై నివేదికలు తయారు చేయాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ప్రతి శాఖ తమ అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, సీడీపీవో దేవకుమారి, ఎంఈవో మునిసుబ్రమణ్యం, ఇన్‌చార్జీ ఈవోపీఆర్డీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రదోష పూజలు



నందీశ్వరుడికి అభిషేకం

నాగలాపురం, జూలై 8, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయంలో మంగళవారం ప్రదోష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుక్కుల్ ఆలయంలోని పరివార దేవతలకు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనం, పన్నీరుతో అభిషేకాలు చేసి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి వారిని పుష్పాలతో అలంకరించి చేసి కుంభ, నక్షత్ర, మంగళ హారతులు చేపట్టారు.

ముక్కంటి సేవలో ఎస్ఐసీ కమిషనర్



దర్శనానంతరం కుటుంబీకులతో ఉదయభాస్కర్ రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఏపీ ఇన్ఫర్మేషన్ కమిషన్ కమిషనర్ అల్లారెడ్డి ఉదయభాస్కర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారికి ఆశీర్వచనం ఇచ్చి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీకాళహస్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ద్రాక్షారామానరరికి చెందిన సీతామహాలక్ష్మి రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

దుకాణాల తనిఖీ

రేణిగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు సమీపంలోని దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. ఆపరేషన్స్ సేఫ్ క్యాంపస్ జోన్‌లో భాగంగా పాఠశాలల సమీపంలో ఉన్న దుకాణదారులను గుట్కా మొదలైన మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసి గంజాయి, మత్తు పదార్థాల కారణంగా కలిగే నష్టాలను ఎస్ఐ అరుణ్ కుమార్ వివరించారు.